

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



విజయవాడ -సింగపూర్ ఇండిగో విమాన సర్వీసు

3



## వికసిత్ భారత్‌కు వెన్నెముక.. రైతే

8

దేశం వికసిత్ భారత్‌వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటలపైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలి. ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించండి. పంటల ఉత్పత్తి ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగానికి కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలిస్తే.. ఎన్డీయే ప్రభుత్వం పదేళ్లలో రూ.13 లక్షల కోట్లకుపైగా సబ్సిడీలిచ్చింది. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలి. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువస్తున్నాం.

**ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ఆరంభించిన సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ**



## నా దృక్పథం.. నాణ్యమైన వైద్య సేవ

నిరుపేదకు నాణ్యమైన వైద్యం అందించాలన్నది నా దృక్పథం. అది వైసీపీకి నచ్చట్లేదు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణం వల్ల రెండేళ్లలోనే అస్పత్రులు అందుబాటులోకి రావడమే కాదు, పేద విద్యార్థులకు అదనంగా 110 మెడికల్ సీట్లు దక్కుతాయి. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్లు అవసరానికి కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తారు. మరి, పేదల పరిస్థితి. పేదలకు మాత్రం ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించొద్దా? నేనేపని చేసినా పేదలను దృష్టిలో ఉంచుకునే చేస్తా. గత పాలకుల విధానం అనుసరిస్తే.. కళాశాలలు పూర్తవ్వడానికి 20యేళ్లు పడుతుంది. అప్పటి వరకూ వైద్యం కోసం పేదలు ఇబ్బందులు పడాలా?

**-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**


నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంలో.. మెడికల్ కాలేజీల నిర్మాణంపై వైసీపీ ఫేక్ ప్రచారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కౌంటర్.



3

## దూరదృష్టి, నిబద్ధతే మీ విజయ కేతనం

# ఆదాయం.. ఉపాధే లక్ష్యం!



- ప్రతీ ఇంటా చిరువ్యాపారమో.. చిన్న పరిశ్రమో స్థాపించేలా ప్రణాళిక
- స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోకూ విస్తరిస్తామని స్పష్టీకరణ

2

ప్రతీ కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ విధానంలో భాగంగా ప్రతీ ఇంటా చిరు వ్యాపారమో చిరు పరిశ్రమో స్థాపించేలా పని చేస్తున్నామన్నారు. శనివారం నెల్లూరులోని మైపాడు గేట్‌వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చ్యువల్‌గా ప్రారంభించారు. రూ.7 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 30 మాడ్యులర్ కంటైనర్లతో 120 దుకాణాలను ఏర్పాటు చేసి వీధి వ్యాపారులకు స్థిర వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించింది. వీటిని ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు నేరుగా లబ్ధిదారులైన దుకాణదారులతో మాట్లాడారు.







# డేటా హబ్.. విశాఖ

- నేడు విశాఖలో ఐటీ మంత్రి నారా లోకేష్ పర్యటన
- సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన



కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి. విశాఖ డేటా సెంటర్ల హబ్‌గా రూపుదిద్దుకోనుంది. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్న విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్.. ఈ దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నారు. అక్టోబర్ 12 ఆదివారం విశాఖలో మొట్టమొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌తోపాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్నారు. ఈ ఏఐ ఆధారిత డేటా సెంటర్ రాకతో భారతదేశ తదుపరి గ్లోబల్ డిజిటల్ గేట్‌వేగా విశాఖ రూపుదిద్దుకోవడంతోపాటు సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుంది.

3

## విద్యార్థులు క్షేమమేనా?

- అన్నపర్రు విద్యార్థుల ఆరోగ్యస్థితిపై సీఎం చంద్రబాబు ఆరా
- ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకోవాని ఆదేశాలు



## కుదుటపడ్డాకే.. విద్యార్థుల డిశ్చార్జ్

- ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఇవ్వండి
- వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి
- 'అన్నపర్రు' ఘటనలు పునరావృతం కాకూడదు
- బీసీ సంక్షేమ మంత్రి ఆదేశం

## రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది

- భారతదేశ బలమైన భవిష్యత్ రైతు చేతుల్లోనే ఉంది
- ప్రపంచవ్యాప్తంగా ప్రోటీన్ అవసరాలు పెరుగుతున్నాయి
- వాటిని తీర్చడంలో భారత్ కీలక పాత్ర పోషించనుంది
- ఆహార భద్రతలో స్వావలంబనే ప్రధాని మోదీ లక్ష్యం
- 'ధన ధాన్య కృషి యోజన' ప్రారంభంలో మంత్రి అచ్చెన్న



- వివరాలు 7 లో..

## కల్తీ మద్యంపై యాక్షన్ ప్లాన్

- కాసుల కక్కుర్తితో కల్తీకి తెరలేపిందే జగన్ రెడ్డి
- కల్తీ బ్రాండ్లను మార్కెట్‌కు తీసుకొచ్చిందీ జగనే
- ఎన్‌ఫోర్స్‌మెంట్ పనితీరుతోనే కల్తీ మద్యం పట్టుకున్నాం
- శవ రాజకీయం కోసమే కల్తీ మద్యం ఆరోపణలు
- ప్రజలే బాటిల్ స్టేటస్ తెలుసుకునేలా ఏపీటాట్స్ యాప్ తెస్తున్నాం
- కల్తీ మద్యం కేసులో ఎవరున్నా, ఎంతటి వారున్నా వదిలిపెట్టం
- రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



- వివరాలు 6 లో..

### లోపలి పేజీల్లో..

## 'స్మార్ట్ రేషన్'తో పారదర్శకత

- అర్హులందరికీ కార్డులు, రేషన్ అందేలా చర్యలు
- ప్రతి ఒక్కరి సంక్షేమానికి కూటమి కృషి
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

- వివరాలు 4 లో..

చైతన్యరథం

# ఆదాయం.. ఉపాధే లక్ష్యం!

- ప్రతీ ఇంటా చిరువ్యాపారమో.. చిన్న పరిశ్రమో స్థాపించేలా ప్రణాళిక
- స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోకూ విస్తరిస్తామని స్పష్టీకరణ
- కల్తీ మద్యాన్ని గుర్తించేలా త్వరలో మొబైల్ యాప్
- పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యానికి మోకాలడ్డుతున్నారు
- వైసీపీ దుష్ప్రచారంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం



అమరావతి (చైతన్య రథం): ప్రతీ కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్ విధానంలో భాగంగా ప్రతీ ఇంటా చిరు వ్యాపారమో చిరు పరిశ్రమో స్థాపించేలా పని చేస్తున్నామన్నారు. శనివారం నెల్లూరులోని మైపాడు గేట్‌వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చ్యువల్‌గా ప్రారంభించారు. రూ.7 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 30 మాడ్యులర్ కంటైనర్లతో 120 దుకాణాలను ఏర్పాటు చేసి వీధి వ్యాపారులకు స్థిర వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించింది. వీటిని ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు నేరుగా లబ్దిదారులైన దుకాణదారులతో మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్‌లో దుకాణాలు పొందిన 120మంది ఇప్పుడు వ్యాపారవేత్తలయ్యారు. 18 ఏళ్లకుపైగా వీధి వ్యాపారాలు చేసి ఇప్పుడు అత్యాధునిక దుకాణాలుపొంది వ్యాపారాలు చేస్తున్న అందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను. మహిళలు, దివ్యాంగులు, వెనకబడిన వర్గాలకు ఈ దుకాణాలను అత్యంత పారదర్శకంగా కేటాయించాం. గతంలో అపరిశుభ్రమైన పరిస్థితుల్లో వ్యాపారాలు చేసుకునే స్థితినుంచి ఇప్పుడు అత్యాధునిక దుకాణాల ద్వారా వ్యాపారం చేసుకునే సౌలభ్యం కలిగించాం. కొనుగోలుదారులకు అన్ని వస్తువులూ ఒకేచోట లభించేలా ఈ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ ప్రాంతం ఏర్పాటైంది. ఎవరైనా ఒక వస్తువు కొనుగోలు చేయాలంటే ఎక్కడికీ వెళ్లకుండా ఒకేచోట ఉండేలా ఏర్పాటు చేయటం అభినందనీయం. రూఫ్ టాప్ సీటింగ్, వైఫైలాంటి ఏర్పాట్లు చేయటం సంతోషంగా ఉంది. ఈ వినూత్న ప్రయత్నం చేసిన మంత్రి నారాయణ, పురపాలక శాఖ, మెప్మా అధికారులను అభినందిస్తున్నాను. ఈ తరహా వినూత్న ఆలోచనలు, ప్రయత్నాలు మరిన్ని జరగాలి అని ముఖ్యమంత్రి అన్నారు.

### ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా కార్యక్రమాలు

కూటమి ప్రభుత్వం పేదలు, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా కార్యక్రమాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ద్వారా నెల్లూరుకు ముందుగానే దీపావళి వచ్చిందని.. ఈ వెలుగులు శాశ్వతం చేస్తామని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో ఆధునిక దుకాణాలను ఏర్పాటు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. నెల్లూరు మైపాడు గేట్‌వద్ద స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఏర్పాటుచేసి తొలిసారి మంచి ప్రయోగం చేశామని, ఇది చరిత్రలో నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు.

120మంది చిన్న పారిశ్రామికవేత్తలుగా మొదటి అడుగు వేశారని.. మీరు మరింతగా ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి అభిలాషించారు. రాష్ట్రంలో డ్వాక్రా, మెప్మా సంఘాలకు చెందిన లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

### వీధి వ్యాపారాలు చేసే మాకు శాశ్వత దుకాణాలు: మహిళా లబ్దిదారులు

నెల్లూరు మైపాడుగేట్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌లో దుకాణాలు దక్కించుకున్న మహిళలు అమితానందాన్ని వ్యక్తం చేశారు. మహిళా వ్యాపారులతో ముఖ్యమంత్రి అమరావతి నుంచి వర్చువల్‌గా మాట్లాడి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్మార్ట్ దుకాణాలు వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు తెస్తాయన్న అంశాలను వారి నుంచే అడిగి తెలుసుకున్నారు. దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీధి వ్యాపారాలకు సైతం కిరాయి చెల్లించుకోలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తమకు ఈ దుకాణాలు ఇచ్చి ఆదుకుని తమ జీవితాల్లో వెలుగులు నింపిందని లబ్దిదారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పేదలు, మధ్యతరగతి వారి జీవన ప్రమాణాలు పెంచేందుకే ప్రభుత్వం కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌లో దుకాణాలు పొందిన మహిళా వ్యాపారులు వాటి హక్కు పత్రాలను చేతుల్లో పట్టుకుని ముఖ్యమంత్రికి చూపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ద్వారా నిత్యావసరాలతో పాటు వివిధ వస్తువుల ధరలు తగ్గాయని రెండు శ్లాబ్‌లతో ప్రజలపై భారం తగ్గిందని ముఖ్యమంత్రి అన్నారు. ఈనెల 16న ప్రధాని మోదీ కూడా కర్నూలుకు వచ్చి ఈ అంశాలను ప్రజలకు వివరిస్తారని ముఖ్యమంత్రి తెలిపారు.

### కల్తీ మద్యం గుర్తించేందుకు కొత్త యాప్

గత పాలనలో మద్యం విధానంలో చాలా అక్రమాలు చోటు చేసుకున్నాయని సీఎం అన్నారు. గంజాయి, డ్రగ్స్, నాసిరకం మద్యంతో 30 వేల మంది ప్రాణాలు తీసి ఆడబిడ్డల తాళిబొట్లు తెంచారని ఆక్షేపించారు. రాష్ట్రంలో ఎవరు నకిలీ మద్యం తయారుచేసినా, విక్రయించినా వారికి అదే చివరి రోజు అవుతుందని సీఎం హెచ్చరించారు. ఇటీవల ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేసిన వారిని పట్టుకుని కేసులు పెట్టామని ..ఈ వ్యవహారంలో టీడీపీ వారున్నా ఉపేక్షించకుండా అరెస్టు చేసి కఠినంగా వ్యవహరించామని అన్నారు. కొందరు దీనిని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తూ శవరాజకీయాలు చేస్తున్నారని అన్నారు. తండ్రి చనిపోతే డ్రామాలాడారని.. బాబాయిని చంపేసి మాపై దుష్ప్రచారం చేయడం చూశామని వ్యాఖ్యానించారు.

నెల్లూరులో సాధారణ మరణాన్ని కూడా మద్యం తాగి చనిపోయారంటూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఫేక్ ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు త్వరలోనే ప్రభుత్వం ఓ యాప్ ను తీసుకురానుందని సీఎం ప్రకటించారు. అనుమానం ఉన్న ఎవరైనా మద్యం బాటిల్‌పై ఉన్న హెలో గ్రామ్ స్కాన్ చేస్తే వివరాలు తెలుసుకునేలా యాప్ రూపొందిస్తున్నట్టు వివరించారు.

### నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తే వైసీపీకి అభ్యంతరం ఏమిటి?

పీపీపీ విధానంలో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల్లో నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తే వైసీపీకి వచ్చిన అభ్యంతరం ఏమిటని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. పీపీపీలో నిర్మించే వైద్య కళాశాలల్లో నాణ్యమైన వైద్య సేవలతోపాటు 110 మెడికల్ సీట్లు అదనంగా పేద విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని సీఎం స్పష్టం చేశారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న వ్యక్తులు వారికి అనారోగ్యం కలిగితే కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని.. కానీ పేదలకు మాత్రం ఉచితంగా నాణ్యమైన వైద్యం వద్దా అని నిలదీశారు. తాను ఏ పనిచేసినా పేదలను దృష్టిలో ఉంచుకునే చేస్తానని, మంచి విద్య, వైద్యంతోపాటు ఆదాయం పెరిగేందుకు కృషి చేస్తానన్నారు.

గత పాలకులు అనుసరించిన విధానంతో ఆస్పత్రులు కడితే కనీసం 20 ఏళ్ళు పడుతుందని అప్పటి వరకూ పేదలు ఇబ్బందులు పడాలా? అని సీఎం ప్రశ్నించారు. పీపీపీ విధానంలో రెండేళ్లలోనే ఆస్పత్రులు అందుబాటులోకి వస్తాయన్నారు. యజ్ఞంలా చేస్తున్న మంచి కార్యక్రమాలకు విఘ్నాలు కల్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. నెల్లూరులో కృష్ణపట్నం, రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులతో పాటు దగదర్తి ఎయిర్ పోర్టు, బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీలాంటి ప్రాజెక్టులు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలు ఎంపిక చేసుకున్న ప్రభుత్వానికి వారి సహకారం అవసరం అని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో పురపాలక మంత్రి పి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా సహా నెల్లూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





## దూరదృష్టి, నిబద్ధతే
# మీ విజయ కేతనం



- సీఎంగా 15 ఏళ్ల ప్రయాణంపై చంద్రబాబుకు ప్రధాని అభినందనలు
- ప్రధాని మోదీ సహకారంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిస్తామన్న చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబుకు శనివారం ఫోన్ చేశారు. సీఎంగా 15 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తిచేసిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. దూరదృష్టి, నిబద్ధత, విలువలవల్లే చంద్రబాబు రాజకీయ జీవితం విజయవంతమైందని మోదీ వ్యాఖ్యానించారు. ఇరువురు సీఎంలుగా ఉన్నప్పుడు అనేక సందర్భాల్లో కలిసి పని చేశామని నాటి సంగతులను మోదీ గుర్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి చంద్రబాబు చేస్తున్న కృషి కొనసాగాలని... ప్రజా సంక్షేమ బాటలో సీఎం చంద్రబాబు అంకితభావంతో చేస్తున్న కృషి మరింత ఫలప్రదం కావాలని ప్రధాని ఆకాంక్షించారు. దీనికి స్పందించిన సీఎం చంద్రబాబు... ప్రధాని మోదీ సహకారంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు. ప్రధాని నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తామని సీఎం చంద్రబాబు మోదీతో అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, తర్వాత ప్రధానిగా మోదీ 25ఏళ్లుగా దేశానికి సేవలందిస్తున్నారని చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని ట్వీట్ చేయగా ధన్యవాదాలు తెలుపుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి ట్వీట్ చేశారు.

### గవర్నర్‌కు ధన్యవాదాలు

సీఎంగా 15 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తిచేసిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు చంద్రబాబు ట్వీట్ చేస్తూ.. "మీ మాటలు నాలో మరింత ఉత్తేజాన్ని నింపాయి. మీరు ప్రకటించిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు. నా ప్రజలకు సేవ చేయడం నా జీవితంలో గొప్ప గౌరవం. ఈ అవకాశం లభించినందుకు నేను నిజంగా ఆశీర్వదించబడ్డాను" అని పేర్కొన్నారు.


## విజయవాడ- సింగపూర్‌మధ్య ఇండిగో విమాన సర్వీసు
### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

విజయవాడ (చైతన్య రథం): విజయవాడ- సింగపూర్ మధ్య ఇండిగో నూతన విమాన సర్వీసును ప్రారంభించ నున్నట్టు పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయవాడనుంచి మంగళ, గురు, శనివారాల్లో సర్వీసు ఉంటుందని చెప్పారు. నవంబర్ 15నుంచి విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని, విజయ వాడ నుంచి నేరుగా సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయానికి చేరకోవచ్చని తెలిపారు. జులై 28న సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉన్న సమయంలో ఈ సర్వీసు విషయం ప్రస్తావనకు వచ్చి నట్టు రామ్మోహన్ నాయుడు గుర్తుచేశారు. ప్రవాసాంధ్రుల సమావేశంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో సర్వీసును ఏర్పాటు చేశామన్నారు. స్వర్ణాంధ్ర 2047లో ప్రవాసాంధ్రుల పాత్ర అత్యంత కీలకమన్నారు. భవిష్యత్‌లో కోటికిపైగా ప్రవాసాంధ్రులు ప్రయాణాలు జరిపే అవకాశం ఉండటంతో ఇంటర్నేషనల్ కనెక్టివిటీని మరింత విస్తృతం చేస్తామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని విమాన సర్వీసును అందుబాటు లోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ సౌకర్యం తెలుగు ప్రవాస భారతీయులకు విశేష ప్రయోజనం కలిగించడమే కాకుండా, వ్యాపార మరియు సాంస్కృతిక బంధాలను మరింత బలపరుస్తుందని, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ అధ్యక్షులు రత్నకుమార్ కవుటూరు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితోపాటు, ఏపీ సీఎం చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# విద్యార్థులు క్షేమమేనా?

- అన్నపర్రు బీసీ హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యస్థితిని ఆరాతీసిన సీఎం
- మంత్రి, అధికారులనుంచి వివరాలు తీసుకున్న చంద్రబాబు
- ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకోవాని ఆదేశాలు

అమరావతి (చైతన్య రథం): గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రు బీసీ బాలుర హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి సవిత, అధికారులతో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారు. విద్యార్థుల అనారోగ్య కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గుంటూరు జనరల్ ఆస్పత్రిలో 24మంది విద్యార్థులున్నారని.. వీరిలో ఒక విద్యార్థికి ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో ఐసీయూలో ఉంచి ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్టు సీఎంకు అధికారులు వివరించారు. పెదనందిపాడు వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారిలో ఇద్దరు వినా.. అందరినీ డిశ్చార్జ్ చేశామని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని సీఎం అడిగారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రి తెలిపారు. ఐసీయూలో ఉన్న ఓ విద్యార్థికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని... అయితే నిపుణుల సూచనలతో ఆ విద్యార్థిని మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించినట్టు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా మెరుగైన తర్వాతే ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్నపర్రు హాస్టల్లోని సౌకర్యాలు, ఆహారంలో నాణ్యత, మంచి నీటి సరఫరావంటి అంశాలపై సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం అన్నపర్రు గ్రామంతో సహా హాస్టల్లో శానిటేషన్ కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి సవిత తెలిపారు. ఫుడ్ పాయిజన్‌వల్ల ఈ ఘటన జరిగిందని వైద్యులు ప్రాథమికంగా చెప్పారని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నీటి, ఆహార నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబుకు పంపామని మంత్రి సవిత



సీఎం దృష్టికి తెచ్చారు. ఆస్పత్రిలో ఉన్న విద్యార్థుల పరిస్థితిని తనకు ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేయాలని మంత్రి, అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆస్పత్రిలో ఉన్న విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడేలా తాము చర్యలు తీసుకుంటున్నామని సీఎం భరోసా ఇచ్చారు.

# డేటా సెంటర్ల హబ్‌గా విశాఖ

- నేడు విశాఖలో ఐటీ మంత్రి నారా లోకేష్ పర్యటన
- సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన
- రూ.1,500 కోట్ల పెట్టుబడి, వెయ్యిమందికి పైగా ఉద్యోగాలు కల్పించనున్న సిఫీ



అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి. విశాఖ డేటా సెంటర్ల హబ్‌గా రూపుదిద్దుకోనుంది. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్న విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్.. ఈ దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నారు. అక్టోబర్ 12 ఆదివారం విశాఖలో మొట్టమొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌తోపాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్నారు. ఈ ఏఐ ఆధారిత డేటా సెంటర్ రాకతో భారతదేశ తదుపరి గ్లోబల్ డిజిటల్ గేట్‌వేగా విశాఖ రూపుదిద్దుకోవడంతోపాటు సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుంది. రాష్ట్రంలో సాంకేతిక రంగం అభివృద్ధిలో భాగంగా విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్.. నాస్ డాక్‌లో నమోదైన దేశ ప్రముఖ డిజిటల్ ఐసీటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ నిర్మించబోయే 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్‌తోపాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 3.6 ఎకరాల భూమిలో రూ.1500 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌ను సిఫీ అభివృద్ధి చేయనుంది. తద్వారా వెయ్యిమందికి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. నూతన కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ సదుపాయంవల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీని మెరుగుపరుస్తూ.. ఎడ్జ్ స్థాయిలో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించే అవకాశం కల్పిస్తుంది. భారతదేశంతోపాటు ఆగ్నేయాసియాలోని సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్‌వంటి దేశాల మధ్య త్వరితగతిన డేటా ప్రాసెసింగ్ చేస్తూ విశాఖ సీఎల్ఎస్ వ్యూహాత్మక ల్యాండింగ్ పాయింట్‌గా పనిచేస్తుంది.

# నకిలీ మద్యం కేసు: 17వరకూ జనార్ధన్‌రావుకు రిమాండ్

విజయవాడ (చైతన్య రథం): ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో నిందితుడు జనార్ధనరావుకు న్యాయస్థానం ఈనెల 17వరకు రిమాండ్ విధించింది. రిమాండ్ రిపోర్టులో ఎక్సైజ్ అధికారులు కీలక విషయాలు వెల్లడించారు. 2012 నుంచి జనార్ధనరావు మద్యం వ్యాపారం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్లో లాభాలు వస్తున్న సమయంలో.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో హైవేపై ఉన్న బార్‌ను ఇతర ప్రదేశానికి మార్చారు. తర్వాత వ్యాపారంలో పోటీ పెరగడం, కరోనాతో 2021 వరకు ఆర్థిక ఇబ్బందులు పడిన అతను.. అప్పటినుంచి నకిలీ మద్యం తయారీపై దృష్టి సారించాడు.

మొదట హైదరాబాద్ నిజాంపేటలో ఒక గది అద్దె కు తీసుకుని అక్రమ మద్యం తరలించడం ప్రారం భించాడు. 35లీటర్ల ప్లాస్టిక్ డబ్బాల్లో మద్యంనింపి నకిలీ ఇన్వాయిస్‌లతో ఇబ్రహీంపట్నం పంపించేవాడు. ఎవరికీ అనుమానం రాకుండా మద్యం డబ్బాలపై పినా యిల్ అని స్టిక్కర్ వేసేవాడు. ఇబ్రహీంపట్నం కేసులో ఏ1గా ఉన్న హాజీ వాటిని రిసీవ్ చేసుకునే వాడని రిమాండ్ రిపోర్టులో ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు. అక్రమ మద్యాన్ని లీటర్ బాటిళ్లలో నింపి... విడిగా విక్రయించడంతో కస్టమర్లకూ అనుమానం రాలేదు.

2022లో 7 పేరుతో మరో ఆరుగురితో కలిసి హైదరాబాద్‌లో జనార్ధన్ కొత్త బారు ప్రారంభించాడు. అక్కడినుంచి 35 లీటర్ల డబ్బాల్లో అక్రమ మద్యం తీసుకొచ్చి ఇబ్రహీంపట్నం ఏఎన్ఆర్ బార్‌లో విక్రయిం చారు. 2023లో ఆరుగురు భాగస్వాములతో కలిసి గోవా వెళ్లిన జనార్దనకు అక్కడి తెలుగు వ్యక్తి, ఈ కేసులో ఏరిగా ఉన్న బాలాజీతో లిక్కర్ స్టోర్‌లో పరి చయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరూ రెగ్యులర్ టచ్‌లో ఉండేవారు. ఏపీలో లిక్కర్ ధరలు ఎక్కువగా ఉండటం వల్ల గోవానుంచి ఎక్స్‌పాన్సివ్ లిక్కర్ బ్రాండ్ కొనుగోలుచేస్తున్నానని బాలాజీ.. జనార్ధన్‌కు చెప్పాడు. ఈ క్రమంలో గోవాలో లభ్యమవుతున్న ఎక్స్‌పెన్సీవ్ బ్రాండ్ మద్యం మాదిరి నకిలీ మద్యాన్ని ఏపీకి పంపిస్తా నని బాలాజీ ప్రతిపాదించాడు. డిస్టలరీస్ బాలాజీకి ఉన్న పరిచయాలతో... మద్యం తయారీకి అవసరమైన ముడి సరకు సరఫరా చేశాడు.

2023 నుంచి ఇబ్రహీంపట్నం ఏఎన్ఆర్ బార్లో కల్తీమద్యం తయారీ ప్రారంభించారు. ఈ కేసులో ఏ4గా ఉన్న రవి హైదరాబాద్ నుంచి నకిలీ లేబుల్స్, దారబోయిన ప్రసాద్ బాటిల్స్ మూతలు సరఫరా చేసేవారు. బాలాజీ బెంగళూరు,ముంబయి, ఢిల్లీనుంచి ఐషర్ వ్యాన్లో ముడి సరకు సరఫరా చేసేవాడు. నకిలీ మద్యంమిశ్రమాన్ని బాలాజీ తయారుచేసి చూపించగా.. తర్వాత జనార్ధన్ సోదరుడు జగన్మోహన్రావు కొనసాగిం చాడు. మంజీరా విస్కీ, కేరళ మాల్ట్, ఓల్డ్ అడ్మిరల్, క్లాసిక్ బ్లూవంటి బ్రాండ్ల పేర్లతో నకిలీమద్యం తయారు చేశారు. మొదట కల్తీ మద్యం బాటిళ్లు ఏఎన్ఆర్ బార్‌లోనే విక్రయించారు. ఒక్కో క్వాటర్ బాటిల్‌పై రూ.35 నుంచి 40రూపాయిల వరకు లాభం ఆర్జించారు. 2024 ఎన్నికల సమయంలో నిఘా పెరగడంతో బాలాజీ.. స్పిరిట్ సరఫరా చేయకపోవడం, కొత్తగా మద్యం దుకాణాలు తెరవడంతో కల్తీ మద్యం కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేశాడు జనార్ధన రావు. తంబళ్లపల్లి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డికి జనార్ధనరావు స్నేహితుడు. జయచంద్రారెడ్డి అతని అనుచరుడు సురేంద్ర నాయుడు, పీఏ రాజేష్.. వైన్‌షాపులు దక్కించుకున్నారు.

2025 మేలో ములకలచెరువులో కల్తీ మద్యం వ్యాపారాన్ని జనార్ధనరావు ప్రారంభించాడు. అదే సమయంలో ఇబ్రహీంపట్నంలో కూడా నకిలీ మద్యం తయారీ ప్రారంభించాడు. జయచంద్రారెడ్డి దక్షిణాఫ్రికాలో ఉన్నాడని తెలిసి గత నెల 25న జనార్ధనరావు అక్కడికి వెళ్లాడు. ఆఫ్రికాలోని రువాండాలో జనార్ధన్ ఉన్న సమయంలో ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడులు జరిగాయి. ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం సూత్రధారి జనార్ధన్" అని రిమాండ్ రిపోర్టులో ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.

చైతన్యరథం

# పకడ్బందీ ప్రణాళికతో తీరప్రాంత కాలుష్య నియంత్రణ

- ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులపై అధ్యయనాలు అవసరం
- రసాయిన వ్యర్థాల నిర్వహణలో పారదర్శకత పాటించాలి
- 100 రోజుల ప్రణాళికతో మత్స్యకారుల సమస్యకు పరిష్కార అన్వేషణ
- కాలుష్య నియంత్రణ ప్రణాళిక.. దేశానికి మోడల్ కావాలి
- కాలుష్య నియంత్రణ సమీక్షలో డిప్యూటీ సీఎం దిశానిర్దేశం



మంగళగిరి (చైతన్య రథం): పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని తీరప్రాంతంతోపాటు కాకినాడ జిల్లా పరిధిలోని పారిశ్రామిక కాలుష్యం, నివారణకు అనుసరించాల్సిన ప్రణాళికల విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉప్పాడ తీర ప్రాంతంలో మత్స్యకారుల ఆందోళన అర్థం చేసుకుని.. అక్కడి పరిస్థితులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సమస్యవున్న పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలంటూ, అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలు చేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్ సిద్ధం చేసి.. 100 రోజుల ప్రణాళికను తక్షణం అమలు చేయాలన్నారు. కాకినాడ తీరప్రాంతంలో కాలుష్య నియంత్రణకు తీసుకోబోయే చర్యలు.. ఒక మోడల్‌గా దేశం మొత్తం పాటించేలా ఉండాలన్నారు. శనివారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో తీర ప్రాంత కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కూలంకషంగా సమీక్ష నిర్వహించారు. సమీక్షలో కాకినాడ జిల్లా యంత్రాంగం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ మండలిలో సిబ్బంది కొరత, కాకినాడలో మత్స్యకారులతో జరిగిన 'మాట.. మంతి' కార్యక్రమంలో మత్స్యకారులు ప్రస్తావించిన సమస్యలు తదితర అంశాలు సమీక్షలో చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా అడుగులేస్తోంది. కొత్త కొత్త పరిశ్రమలు రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో భాగస్వామ్యమవుతున్నాయి. అయితే పెరుగుతున్న పరిశ్రమలతోపాటు ప్రజల్లో ఆందోళనలు, సందేహాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా తీరప్రాంతాల వెంబడివున్న పరిశ్రమలనుంచి వెలువడే రసాయిన వ్యర్థాలు తమ జీవనోపాధిని దెబ్బ తీస్తుందన్న ఆందోళనలు మత్స్యకారుల్లో ఉన్నాయి. ఉప్పాడ తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు ఆందోళన చేయడానికి అదే ప్రధాన కారణం. కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన మాటా.. మంతిలో రసాయన వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలిపేయడం కారణంగా వారు ఇబ్బందులుపడుతున్నామని చెప్పారు. మత్స్యకారుల్లో సందేహాలు నెలకొన్న క్రమంలో వారి సూచనల మేరకు తక్షణం ఆయా పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలి. ఆ పరిశ్రమలు ఏమేరకు కాలుష్యాన్ని సముద్రంలో కలుపుతున్నాయి, జల వాయు కాలుష్యం ఎంత? అనే అంశాలపై అధ్యయనం చేపట్టి సమగ్ర నివేదిక రూపొందించాలి. పరిశ్రమలు సముద్రంలోకి విడుదల చేసే వ్యర్థ జలాలపై పర్యవేక్షణ విషయంలో పారదర్శకతతో వ్యవహరించాలి. పర్యవేక్షణ బృందాల్లో విద్యావంతులైన స్థానిక మత్స్యకారులకు అవకాశం కల్పించాలి. కాలుష్య నియంత్రణ పద్ధతులలో, ట్రీట్మెంట్ ప్లాంట్స్ ఆధునీకరించి నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంపై పారిశ్రామికవేత్తలూ దృష్టి సారించాలి. ఎప్పటికప్పుడు పొల్యూషన్ ఆడిట్ నిర్వహించి ఏదైనా సమస్య గుర్తిస్తే దాన్ని సరి చేసుకునే విధంగా ఆయా కంపెనీలను ఆదేశించాలి. ఇందుకు సంబంధించి పీసీబీ, ఇతర స్టేక్ హోల్డర్స్‌తో కలసి 100 రోజుల్లో పూర్తి స్థాయి రోడ్ మ్యాప్ సిద్ధం చేయాల"ని సూచించారు.

ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సిబ్బంది కొరత సమస్యను పవన్ దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పీసీబీలో సిబ్బందిలేరని, పక్క రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో చాలా తక్కువ సంఖ్యలో సిబ్బంది ఉన్నట్టు తెలిపారు. పవన్ స్పందిస్తూ"అవసరాలకు అనుగణంగా సిబ్బంది నియామకం చేపట్టే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తాం. ప్రస్తుతమున్న సిబ్బందిని సమర్థంగా వినియోగించుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను ఉపయోగించుకుని పరిశ్రమల్లో కాలుష్య తీవ్రత నిర్ధారించడం, నివారించడంపై దృష్టి సారించాలి" అన్నారు.

పారిశ్రామిక వర్గాలు సైతం కాలుష్య నియంత్రణపై దృష్టి సారించాలని, అభివృద్ధి చెందిన దేశాలు రసాయన వ్యర్థాల నిర్వహణలో అమలు చేస్తోన్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకోవాలని, అవసరమైతే పర్యావరణ ప్రేమికులు, పర్యావరణవేత్తలను ఆహ్వానించి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య, మెంబర్ సెక్రటరీ ఎస్ శరవణన్, సీనియర్ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ బిందుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం కుదుటపడ్డాకే 'అన్నపర్రు' విద్యార్థుల డిశ్చార్జి

- విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఇవ్వండి
- మిగిలిన విద్యార్థులకు వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి
- 'అన్నపర్రు' ఘటనలు పునరావృతం కానివ్వొద్దు
- రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి సవిత ఆదేశం



అమరావతి (చైతన్య రథం): జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అన్నపర్రు బీసీ హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్యం పూర్తిగా మెరుగయ్యేకే డిశ్చార్జి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి ఎస్ సవిత ఆదేశించారు. అన్నపర్రు బీసీ హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్‌వివి రమణతో మంత్రి సవిత శనివారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణను అడిగి తెలుసుకున్నారు. 60మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఆసుపత్రికి చేరగా, ప్రస్తుతం 24మంది మాత్రమే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఒక విద్యార్థికి ఐసీయూలో చికిత్స అందజేస్తున్నామని రమణ తెలిపారు. ఆ విద్యార్థి ఇంతకుముందు నుంచే కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధడుతుండడంతో ఐసీయూలో వైద్యమందిస్తున్నామన్నారు. మరో ఇద్దరు విద్యార్థులు పెదనందిపాడు కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన తాత్కాలిక వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నార న్నారు. మిగిలిన విద్యార్థులను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత స్పందిస్తూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిన తరవాతే ఆసుపత్రినుంచి డిశ్చార్జి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై గంటగంటకూ అప్‌డేట్ ఇవ్వాలని ఆదేశించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న విద్యార్థిని తక్షణమే ఎయిమ్స్‌కు తరలించాలని మంత్రి సవిత ఆదేశించారు.

## వారికి వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి

డిశ్చార్జి అయిన విద్యార్థులతో పాటు హాస్టల్‌లో ఉన్న మిగిలిన విద్యార్థులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జునను మంత్రి సవిత ఆదేశించారు. హాస్టల్‌లో పరిశుభ్రతతపై తీసుకున్న చర్యలు గురించి డీబీసీడబ్ల్యూవో మయూరిని అడిగి తెలుసుకున్నారు. కాచి చల్లార్చిన నీటితో పాటు తాజా ఆహారమే విద్యార్థులకు అందివ్వాలన్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లకు వెళ్లదలుచుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులను పిలిచి వారితో పంపించాలన్నారు.

## 'అన్నపర్రు'లాంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దు

అన్నపర్రు బీసీ హాస్టల్‌లాంటి ఘటన రాష్ట్రంలో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండేలా వార్డెన్లను ఆదేశించాలన్నారు. డీబీసీడబ్ల్యూవోలు తమ పరిధిలో హాస్టళ్లను నిరంతం పర్యవేక్షించాలన్నారు. హాస్టళ్లలో వార్డెన్లు ఉండేలా చూడాలని, బయట ఆహారం హాస్టళ్లోకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని టెలీ కాన్ఫరెన్స్ లో మంత్రి సవిత స్పష్టం చేశారు.

# 'స్మార్ట్ రేషన్'తో పారదర్శకత



- అర్హులందరికీ కార్డులు, రేషన్ అందేలా చర్యలు
- ప్రతి ఒక్కరి సంక్షేమానికి కూటమి కృషి
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ప్రకాశం/ ఒంగోలు (చైతన్య రథం): స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టడం ద్వారా పౌరసరఫరాల వ్యవస్థలో నూతన అధ్యాయనికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రస్తుత రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల జిల్లాస్థాయి పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. మంత్రితోపాటు కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, జెసి ఆర్ గోపాలకృష్ణ, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఇతర నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పరిపాలనలో సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, కుటుంబ సభ్యుల వివరాలు, వారు రేషన్ సరుకులు పొందే దుకాణ డీలర్ వివరాలతో ఏటీఎం కార్డు సైజులో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందన్నారు. రేషన్ విధానాన్ని పటిష్టపరచి ఏడీయు వాహనాల స్థానంలో డీలర్ వ్యవస్థను పునరుద్ధరించి వృద్ధులు, వికలాంగుల ఇంటికే నేరుగా రేషన్ సరుకులను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఒంటరి మహిళలకు, ట్రాన్స్‌జెండర్లకు కూడా రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వ 16 నెలల కాలంలోనే జిల్లాలో 20వేలకుపైగా కొత్త రేషన్ కార్డును మంజూరు చేసినట్టు చెప్పారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, సరుకులు అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నట్టు చెప్పారు. నెలలో ఎప్పుడైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇతర సంక్షేమ పథకాలకు కూడా వీటిని గుర్తింపు కార్డులుగా వాడుకోవచ్చు అని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వెల్లడించారు.

# జగన్‌నుంచి బొత్సకు ప్రాణహాని

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

మంగళగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో టీసీఎస్, మహేంద్ర, లూలూ, రిలయన్స్, ఎన్టీపీసీ గ్రీన్‌టెక్ హైడ్రోజన్ వంటి అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయంటే సీఎం చంద్రబాబు అవిరళ కృషేనన్నారు. విశాఖకు ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ వస్తోంది. విశాఖలో సిఫి ఏఐకి సంబంధించి ఒక డేటా సెంటర్ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ప్రారంభించబోతున్నారు. ఢిల్లీలో గూగుల్‌కు చెందిన రైడెన్‌తో రూ.87,500 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకోబోతున్నాం. ప్రసిద్ధి చెందిన డేటా సెంటర్‌గా వర్జీనియా ఉంది. రేపు వరల్డ్ డేటా సెంటర్‌గా విశాఖ మారబోతోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా చేయాలన్న లక్ష్యంతో అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేశారు. చంద్రబాబుపై నమ్మకంతో అనేక పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయి. విశాఖను డేటా హబ్‌గా, డేటా వ్యాలీగా ప్రపంచంలోనే ఉన్నతమైన స్థానానికి తీసుకెళ్లబోతున్నాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేష్ కృషితో నేడు విశాఖ ఐటీ సిటీగా రూపాంతరం చెందబోతోంది. విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంటే... జగన్ రెడ్డి అడుగడుగునా భవిష్యత్ భయంతో అడ్డుపడుతున్నాడు. రాష్ట్ర ప్రయోజనాలను అడ్డుకుంటున్నారు. రాష్ట్రానికి ఎటువంటి పెట్టుబడులు రాకుండా చూడాలని కుట్రలు చేస్తున్నారు. పెట్టుబడిదారులకు భయాందోళనలు కలిగించేలా జగన్ అల్లర్లు చేస్తున్నారు. పెట్టుబడులు పెట్టకండని అనేక ఆర్థిక సంస్థలకు వైసీపీ వాళ్లు లేఖలు రాసి రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని పార్టీ రాష్ట్రాధ్యక్షుడు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పీపీపీకి అర్థం తెలియని వ్యక్తి జగన్

"మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నట్టు జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై తప్పుడు ప్రచారం చేశారు. గత ఐదేళ్లల్లో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు జగన్‌రెడ్డి ఒక్కపైసా విదిల్చలేదు. మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రూ.8,700 కోట్లు కావాల్సి ఉంటే వైసీపీ కేవలం రూ.1400 కోట్లు ఖర్చు చేసింది. అదీ కేంద్రం నిధులు. ఐదు మెడికల్ కాలేజీలను అరకొర వసతులతో ప్రారంభించారు. ఒక్క కాలేజీని కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేదు. ఆస్పత్రి నిర్మాణం లేకుండానే మెడికల్ కాలేజీల బిల్డింగులు నిర్మించారు. సరైన వసతులు, సౌకర్యాలు లేకుండా శంకుస్థాపన చేసి పూర్తి చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. పులివెందుల సీఎంగా ఉండి రూ.400 కోట్లతో పులివెందుల మెడికల్ కాలేజీ కట్టారు. అక్కడా కనీసం సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేకపోయాడు. మిగతా కాలేజీల నిర్మాణానికి ఇంకా రూ.7,300 కోట్లు కావాలి. పీపీపీ మోడల్‌లో ప్రభుత్వం వెళ్తోంది. రూ.7,300 కోట్లు ఖర్చు చేయాలి. మీరుపెట్టిన జీఓ ప్రకారం ఖర్చు చేస్తే మెడికల్ కాలేజీల పూర్తికి ఇంకా 15 ఏళ్ల పడుతుంది. ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీరు ఇచ్చిన ఫీజు విధానం చూస్తే ఆల్ ఇండియా కోటాకు 15 శాతం పెట్టారు. 85 శాతంలో 50 శాతం కన్వీనర్ కోటా పెట్టారు. మిగిలింది 35 శాతంలో 15శాతం రూ.12 లక్షలు. మిగతాది రూ.20 లక్షల చొప్పున పెట్టారు. త్వరగా మెడికల్ కాలజీల నిర్మాణాలు పూర్తి కావాల్సిన అవసరం ఉంది. అది పెట్టుబడుల ద్వారానే సాధ్యమవుతుంది. మీ తండ్రి వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు డబ్బులిచ్చే విధానమే కదా. అప్పుడే ప్రభుత్వ కళాశాలలు పెట్టొచ్చు కదా.? ప్రజలకు వేగవంతంగా సేవలు



అందాలన్న ఉద్దేశంతోనే పీపీపీ మోడల్ తీసుకొచ్చాం. ఈ విధానంపై జగన్‌రెడ్డి తేడా తెలుసుకోవాలి. పోర్టుల్లో కూడా పీపీపీ మోడల్‌లోనే నిర్మాణాలు జరుగుతున్నాయి. జగన్‌లో భయం పట్టుకుంది. జగన్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. అందుకే ఆందోళనలో ఏదేదో చేస్తున్నాడు. ఏదేదో మాట్లాడుతున్నాడు. కేంద్రం నిర్మిస్తున్న ప్రాజెక్టులను చూస్తే చాలా సమయం పడుతుంది. అందుకే పోలవరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది" అని పల్లా స్పష్టం చేశారు.

### స్టీల్ ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా కాపాడాం

"విశాఖ స్టీల్ ప్లాంట్‌పై జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం నుంచి ప్రత్యేక సాయం ద్వారా రూ.11,440 కోట్లు సాధించాం. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రైవేట్‌పరం కాకుండా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాం. స్టీల్ ప్లాంట్‌ను మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు లాభాల బాటలో తేవాల్సిన అవసరముంది. కేంద్రం, రాష్ట్రం సహకారం అందిస్తాం. 32 సెక్షన్లను ప్రైవేట్‌పరం చేయడం లేదు. ఇప్పటికే కాంట్రాక్టర్లే అక్కడ పని చేస్తున్నారు. 1000 మంది 32 భాగాలుగా పనిచేస్తున్నార్నది జగన్‌రెడ్డి గమనించాలి. అవగాహన లేకుండా.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా ధ్వజమెత్తారు.

### రాష్ట్రంలో కల్తీ మద్యానికి ఆద్యుడు జగనే

జగన్‌రెడ్డి పాపాలు నేడు ప్రజలకు శాపాలుగా మారాయని పల్లా వ్యాఖ్యానించారు. "కల్తీ మద్యం మొత్తం కుంభకోణం జగన్‌రెడ్డి ప్రోత్సహించిందే. కొందరు వైసీపీ ముసుగు వేసుకొని టీడీపీలోకి వచ్చారు. వాళ్లను ప్రక్షాళన చేస్తున్నాం. తప్పు చేస్తే కచ్చితంగా శిక్ష వేస్తాం. తప్పు చేశారనే పార్టీనుంచి కల్తీమద్యం కేసులో సస్పెండ్ చేశాం. జగన్‌రెడ్డి తన హయాంలో కల్తీ మద్యం కుంభకోణం బయటపడినా ఒక్క వైసీపీ నేతపైనా చర్యలు తీసుకోలేదు" అని వైసీపీ నీతిమాలిన చర్యలను గుర్తు చేశారు.

### బొత్సకు భద్రత కల్పిస్తాం

బొత్స సత్యనారాయణ అంటే మాకు గౌరవం. నాకు ప్రాణహాని ఉందని బొత్స ప్రకటించారు. ప్రభుత్వపరంగా, పార్టీపరంగా బొత్సకు ఎటువంటి భయం అవసరం లేదు. బొత్స మాటలను బట్టి చూస్తే.. జగన్‌రెడ్డి వల్లే బొత్సకు ప్రాణహాని ఉందని అనిపిస్తుంది. జగన్‌రెడ్డిని దాటి వెళ్లినా, పార్టీలో ఆయనకన్నా ఎక్కువ పేరు సంపాదించుకొన్నా వాళ్లని అంతం చేస్తాడు జగన్. వైఎస్ వివేకాను ఆ కారణంగానే మట్టుబెట్టారు. ప్రతిపక్ష నేతగా బొత్స బాగా ఫోకస్ అవుతున్నారు. మండలిలోనూ ప్రశ్నోత్తరాల సమయంలో బొత్స పనితీరు బాగుంది. బొత్సకు వైసీపీనుంచే ప్రాణ హాని ఉందని అనిపిస్తుంది. బొత్స అడిగితే.. ప్రభుత్వపరంగా భద్రత కల్పిస్తామని హామీ ఇస్తున్నాం" అని పల్లా పేర్కొన్నారు.

---

# భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- బాణసంచా తయారీ,నిర్వహణ, నిల్వల ప్రక్రియ జాగ్రత్త
- నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవు
- అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ రమణ

విజయవాడ (చైతన్య రథం): బాణసంచా తయారీ, నిర్వహణ, నిల్వ ప్రక్రియలలో భద్రతా ప్రమాణాలను పాటించి అగ్ని ప్రమాదాలు, పేలుళ్లను నివారించేందుకు నిర్దేశించిన ప్రామాణిక నిర్వహణ విధానాలను ఖచ్చితంగా పాటించాలని ఏపీ విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పేలుడు పదార్థాల నియమాలు, 2008కి అనుగుణంగా లైసెన్స్ పొందిన తయారీదారులు విధిగా భద్రతా చర్యలను పాటించాలన్నారు. ముఖ్యంగా తయారీ భవనాలు బేస్మెంట్లు లేకుండా ఒకే అంతస్తు నిర్మాణాలుగా ఉండాలన్నారు. బాణసంచా తయారీ షెడ్లు ఒకదానికొకటి మరియు జనావాస ప్రాంతాల నుండి కనీసం 45 మీటర్ల సురక్షిత దూరంలో ఉండాలన్నారు.

కర్మాగారాల్లో దూళి, దుమ్ము లేకుండా తగిన జాగ్రత్తలతో గృహ నిర్వాహక పద్ధతులను పాటించాలన్నారు. ఫ్యాక్టరీ లోపల ఎటువంటి ఫైర్ సంబంధిత మంటలు, ధూమపానం, అగ్గిపెట్టెలు, లైటర్లు మరియు మొబైల్ ఫోన్లు ఖచ్చితంగా నిషేధించాలన్నారు. తయారీ కార్యకలాపాలు ఉదయం 7:30 నుండి సాయంత్రం 5:30 వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. రసాయన మిక్సింగ్‌వంటి ప్రమాదకర ప్రక్రియలను మానవ తప్పిదాలను తగ్గించడానికి ఆటోమేటిగా చేయాలన్నారు. పేలుడు పదార్థాలను నిర్వహించడానికి స్పార్కింగ్ కాని సాధనాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. ప్రతి కార్మికుడు వ్యక్తిగత రక్షణ పరికరాలు ధరించాలన్నారు. 18ఏళ్లకంటే తక్కువ వయస్సు ఉన్నవారిని, మద్యం సేవించిన వారిని ఫ్యాక్టరీలోకి అనుమతించకూడదన్నారు. ఉద్యోగులకు భద్రతా విధానాలు, అత్యవసర ప్రతిస్పందనలపై సమగ్ర శిక్షణ ఇవ్వాలన్నారు. కార్మికులకు జీవిత బీమా మరియు వైద్య బీమా పాలసీ చేయాలన్నారు. ఫ్యాక్టరీలలో ఆటోమేటిక్ అగ్ని గుర్తింపు వ్యవస్థలు, తగిన అగ్నిమాపక యంత్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైసెన్స్ పొందిన తయారీదారులు అందరూ మార్గదర్శకాలను పాటించాలని, తద్వారా సురక్షితమైన పని వాతావరణాన్ని ఏర్పరచి, ప్రజా భద్రతకు భరోసా ఇవ్వాలన్నారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని డైరెక్టర్ జనరల్ పీవీ రమణ హెచ్చరించారు.

---

# 'కల్తీ'ని పోత్సహించిందే జగన్

- సౌత్ ఆఫ్రికాలో ఆ వ్యాపారం చేసింది తమరి బినామీలే
- జయచంద్రా రెడ్డి వైసీపీ కోవర్టు
- కల్తీ మద్యం మరణాలు, వ్యాపారంపై జగన్ బహిరంగ చర్చకు సిద్ధమా?
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సవాల్



మంగళగిరి (చైతన్య రథం): గత ఆరేళ్లుగా రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారడానికి కారణం జగనేనని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కల్తీ మద్యానికి మూలకారణం జగనేనని, దాన్ని ప్రోత్సహించిందీ జగనేనన్నారు. దీన్ని ఖండించే ధైర్యం జగన్‌కు ఉందా? అని నిలదీశారు. మీ నాయకుడు మల్లాది విష్ణు బార్‌లో కల్తీ మద్యం తాగి ఆరుగురు చనిపోతే, అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. గతంలో సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల్లో వైసీపీ నాయకులు కాకాణి గోవర్ధన్, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి కల్తీ మద్యంలో భాగస్వాములైనది నిజం కాదా? వారిపై కేసులున్నది నిజం కాదా? వారిపై వైసీపీ క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27మంది చనిపోతే, ఆ కేసును తప్పుదారి పట్టించినది మీరు కాదా? అప్పుడు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? కానీ, కల్తీమద్యం గురించి వివరాలు తెలిసిన వెంటనే సంబంధిత వ్యక్తులను ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్ చేయించారు. మీ పార్టీ కోవర్ట్ అయిన జయచంద్రారెడ్డిపై ప్రభుత్వం లుక్‌అవుట్ నోటీసులుజారీచేసి,పార్టీనుంచి సస్పెండ్ చేసింది. మీరు ఎప్పుడైనా అలా చేశారా? జయచంద్రారెడ్డి ఎక్కడ తల దాచుకున్నాడో జగన్‌కుతెలియదా? వైసీపీ కోవర్ట్ జయచంద్రారెడ్డి, మీ సునీల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి క్యాంప్‌లో తలదాచుకున్నది నిజం కాదా? వైఎస్ సునీల్‌రెడ్డి, వైఎస్ అనిల్‌రెడ్డి జగన్ బినామీలు కాదా? కల్తీ మద్యంపై కేసులు వేయగానే వీరంతా సౌత్ ఆఫ్రికాకు పరారయ్యారని వర్ల రామయ్య ఆరోపించారు.రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం ఎక్కడ జరుగుతుందో తెలుసుకోవడానికి చంద్రబాబు చర్యలు చేపట్టారు, కానీ మీరు అలా చేశారా? అని జగన్‌ను నిలదీశారు. మీ చెత్త పత్రికల్లో కూటమి ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు రాస్తున్నారని, సీఎం చంద్రబాబును ముద్దాయిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని వర్ల మండిపడ్డారు. మీరు ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని హెచ్చరించారు. పెద్దిరెడ్డి తన తమ్ముడిని గెలిపించు కోవడానికి జయచంద్రారెడ్డిని ఎన్నికల ముందు టీడీపీలో వైసీపీ కోవర్ట్‌గా పనిచేయించారని ఆరోపించారు. జగన్ పాలనలో కల్తీ మద్యంపై ఏనాడూ స్పందించలేదని విమర్శించారు. దానివల్ల 30 వేలమంది పేదలు మరణించారని ఆరోపించారు. మీరు సరఫరా చేసిన మద్యంలో విషపూరిత పదార్థాలున్నట్లు చెన్నై, బెంగళూరు ల్యాబ్‌లు నిర్ధారించింది నిజం కాదా? అప్పుడు బాధ్యులపై చర్యలెందుకు తీసుకోలేదని నిలదీశారు. ఏలూరులో మద్యం తాగి ఒక వ్యక్తి చనిపోతే, అది కల్తీ మద్యంగా ప్రచారం చేశారు. కానీ ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ అది కల్తీ మద్యం కాదని నిర్ధారించింది. దీనిపై మీ సమాధానం ఏమిటని జగన్‌ను ప్రశ్నించారు. కల్తీ మద్యం సరఫరాకు మూలవిరాట్ మీరేనని మేము చెబుతున్నా మని, దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని జగన్‌కు సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వంలో ఎవరు తప్పు చేసినా, కల్తీ మద్యం వ్యవహారంలో ఎంతటి వారైనాసరే, వారిని వదిలేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

చైతన్యరథం

# కల్తీ మద్యంపై యాక్షన్ ప్లాన్

- కాసుల కక్కుర్తితో కల్తీకి తెరలేపిందే జగన్ రెడ్డి
- కల్తీ బ్రాండ్లను మార్కెట్‌కు తీసుకొచ్చింది జగనే
- ఎన్‌ఫోర్స్‌మెంట్ పనితీరుతోనే కల్తీ మద్యం పట్టుకున్నాం
- శవ రాజకీయం కోసమే కల్తీ మద్యం ఆరోపణలు
- ప్రజలే బాటిల్ స్టేటస్ తెలుసుకునేలా ఏపీటాట్స్ యాప్ తెస్తున్నాం
- కల్తీ మద్యం కేసులో ఎవరున్నా, ఎంతటి వారున్నా వదిలిపెట్టం
- రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



విజయవాడ (చైతన్య రథం): కల్తీ మద్యంపై వైసీపీ నేతలు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించడమేనని రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. విజయవాడ ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం మీడియాతో మాట్లాడారు. అన్నమయ్య జిల్లా మొకలకలచెరువులో కల్తీ మద్యం కేసును విచారిస్తున్నాం. 23మంది నిందితులను గుర్తించి, 14మందిని అరెస్టు చేశాం. సూత్రధారి జనార్ధన్ రావు గన్నవరం ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డారు. భవానీపురంలో మరో కేసును గుర్తించాం. అక్కడ 12మందిని నిందితులుగా గుర్తించి 5గురిని అరెస్ట్ చేశాం. నలుగురికి పీటీ వారెంట్ ఇచ్చాం. జయచంద్రారెడ్డి పాత్ర ఉందని తేలడంతో అతని కోసం గాలిస్తున్నాం. కల్తీమద్యం కేసును నాలుగు బృందాలు విచారిస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరు సహా పలు ప్రాంతాల్లో ఆయా బృందాలు నిందితులను గుర్తించే పనిలో ఉన్నాయని మంత్రి వెల్లడించారు.

జయచంద్రారెడ్డి పాత్ర ఉన్నట్టు గుర్తించగానే తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేశామని, తెనాలికి చెందిన వైసీపీ బూత్ కన్వీనర్ ఇదే స్కాంలో ఉంటే ఎందుకు సస్పెండ్ చేయలేదో జగన్ సమాధానం చెప్పాలని నిలదీశారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి, మల్లాది విష్ణులాంటి వారు తమ కల్తీ మద్యంతో ఎంతోమంది ప్రాణాలు తీశారు. వారిని సస్పెండ్ చేయకపోగా పదవులివ్వడమే జగన్ రెడ్డి నైతికతా? అని ప్రశ్నించారు. కల్తీ మద్యాన్ని ప్రజలు గుర్తించేలా ఏపీటాట్స్ యాప్ రూపొందించామని, బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. తయారైన చోటు, బ్యాచ్, డిపో, ఏ షాపునకు చేరింది అనే ప్రతి వివరం అందులో ఉంటుందని స్పష్టం చేశారు. కల్తీ వ్యాపారంపై ట్రాకింగ్ విధానంతో పూర్తి నిఘా పెట్టామని, గత ఐదేళ్లు ట్రాక్ అండ్ ట్రేస్ విధానాన్ని జగన్‌రెడ్డి నాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎక్సైజ్ వ్యవస్థను ప్రక్షాళన చేశాం కనుకే.. మెరుగైన పనితీరుతో రెండుచోట్ల కల్తీ మద్యాన్ని గుర్తించామన్నారు. సేల్స్ ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తున్న కారణంగానే ప్రస్తుత స్కాం బయటపడిందన్నారు. గత వైసీపీ హయాంలో సరిహద్దుల్లో అక్రమ మద్యం రవాణా ఎక్కువగా ఉండేదని, పొరుగు రాష్ట్రాలకంటే ఇక్కడ ఎక్కువ ధరలు ఉండటమే అందుకు కారణమన్నారు. నేడు ధరలు సమానం చేయడంతోపాటుగా, క్వాలిటీ మద్యం అందుబాటులోకి తెచ్చి.. అక్రమ రవాణా నిర్మూలించినట్టు మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికీ చాలా రాష్ట్రాల్లో ఈఎన్‌ఏ, రెక్టిఫైడ్ స్పిరిట్ ఉందంటూనే.. ఏపీలో కల్తీ లేకుండా చూస్తున్నామన్నారు. నవోదయం 2.0 ద్వారా నాటు సారా పూర్తిగా నిర్మూలించామని, 21 జిల్లాలను ఇప్పటికే సారారహిత జిల్లాలుగా మార్చామన్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ప్రతి బాటిల్‌ను 13సార్లు పరీక్షిస్తూనే.. డిపోలనుండి షాపులకు చేరిన తర్వాతా పరీక్షిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. మద్యం విధానపై అత్యంత పారదర్శకంగా పనిచేస్తుంటే.. జగన్‌రెడ్డి ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాడని దుమ్మెత్తిపోశారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా పారదర్శకంగా అమ్మామని చెబుతున్నారని, అప్పటివరకు ఉన్న మల్టీ నేషనల్ బ్రాండ్లు 2019 తర్వాత రాష్ట్రంలో ఎందుకు లేకుండాపోయాయో సమాధానం చెప్పాలన్నారు. "ప్రపంచంలో ఎక్కడా కనీవినీ ఎరుగని బ్రాండ్లు ఎలా వచ్చాయి? ప్రభుత్వ షాపుల పేరిట తన వారికి ప్రభుత్వ ఖజానాను దోచిపెట్టడం నిజం కాదా? రవాణా మొత్తాన్ని తమ చేతుల్లో పెట్టుకుని.. రాష్ట్రంలోని మద్యం వ్యాపారం మొత్తాన్ని సిండికేట్ చేసిన జగన్‌రెడ్డి నీతి వాక్యాలు వల్లించడం హాస్యాస్పదం" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి కల్తీ అని ఆరోపణలు చేయడం కాదు.. అది నిరూపించాలి. సాధారణ మరణాలను సైతం మద్యానికి లింక్ చేస్తున్నారు. చనిపోయిన ప్రతి కేసులోనూ ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోస్టుమార్టం చేస్తున్నాం. ఎవరు ఎక్కడ ఎలా చనిపోయినా మద్యానికి లింక్ చేయమని జగన్‌రెడ్డి వైసీపీ నేతలకు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. శవ రాజకీయాలకు అలవాటుపడిన జగన్‌రెడ్డి తన విధానం మార్చుకోవాలని, వైసీపీ అరాచకాలను చూసి ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసిన విషయాన్ని గుర్తెరగాలని హితవు పలికారు. తప్పుడు ప్రచారాలను ఉపేక్షించేది లేదంటూనే.. కల్తీ మద్యం కేసుల్లో ఎంతటివారున్నా చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గుడ్డకాల్చి మొహానవేసి పారిపోతామంటే.. అలాంటివాళ్లను ఎన్డీయే ప్రభుత్వం వదిలిపెట్టేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

## మెరుగైన విద్యావ్యవస్థే లక్ష్యంగా ప్రతీ ఏటా డీఎస్సీ

- లోకేష్ ఆధ్వర్యంలో విజయవంతంగా మెగా డీఎస్సీ పూర్తి
- గతంతో పోలిస్తే.. ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన డ్రాపౌట్ల సంఖ్య
- రాజకీయ వాతావరణానికి దూరంగా పిల్లలకు విద్య
- 356మందికి ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి గొట్టిపాటి




అద్దంకి (చైతన్య రథం): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధంగా ఉందని ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఇప్పటికే మెగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించామన్నారు. త్వరలోనే ఎంపికైన అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో సేవలందిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాల విద్యార్థులతో పోటీ పడుతున్నారని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు జరిగిన రాజకీయ వాతావరణానికి దూరంగా చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఏ కార్యక్రమంలోనూ రాజకీయ నాయకులు ఫోటోలు, పార్టీ గుర్తులు, రంగులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్ల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు. శనివారం అద్దంకి నియోజకవర్గంలోని జె.పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన 356 విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సహకారంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు వెయ్యి సైకిళ్లు అందించనున్నట్లు వివరించారు. ఇప్పటికే దాతల సహకారంతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అనంతరం దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాలును మంత్రి ప్రారంభించారు. అంతేగాకుండా రూ.15.58 లక్షలతో ఏర్పాటు చేసిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభించారు. ముందుగా గ్రామంలో రూ.65 లక్షలతో కొత్తగా నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజ్ కాలువలను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. కొండమంజులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో 57మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను, ఎల్వోసీలను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టిన పీ-4 పథకంలో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పీ-4 ద్వారా సమాజానికి సేవ చేసే చక్కటి అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీల రూపంలో వచ్చిన ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.

## మీ సమస్యలు పరిష్కరిస్తాం

- గ్రానైట్ పాలిషింగ్ అండ్ కటింగ్ యజమానులకు భరోసా
- చీమకుర్తి యజమానులతో సమావేశమైన మంత్రి కొల్లు

విజయవాడ (చైతన్య రథం): సమస్యలను సామరస్యంగా చర్చించి పరిష్కరించుకోవడం సరైన మార్గమని చీమకుర్తి గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్స్ యజమానులకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. విజయవాడలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రిని చీమకుర్తి గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్స్ యజమానులు కలిశారు. యూనిట్ల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఒక్కో బ్లేడ్‌కు నెలకు రూ.35 వేలవరకు సీనరేజి చెల్లిస్తున్నామన్నారు. అన్ని గ్రేడ్‌ల ముడి సరుకుకు కూడా ఒకేవిధంగా సీనరేజి చెల్లించడం ఆర్థికంగా ఇబ్బంది కలుగుతోందని, సమస్యను పరిష్కరించాలని మంత్రికి విన్నవించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మైనింగ్ అధికారులు, ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి, కటింగ్ యూనిట్స్ నిర్వాహకులకు ఎలాంటి నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మె కారణంగా ఫ్యాక్టరీలపై ఆధారపడిన కార్మికులు అవస్థలు పడతారని, తక్షణమే సమ్మె విరమించి పనులు ప్రారంభించాలని గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ యజమానులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.



# రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది

- భారతదేశ బలమైన భవిష్యత్ రైతు చేతుల్లోనే ఉంది
- ప్రపంచవ్యాప్తంగా ప్రొటీన్ అవసరాలు పెరుగుతున్నాయి
- వాటిని తీర్చడంలో భారత్ కీలక పాత్ర పోషించనుంది
- ఆహార భద్రతలో స్వావలంబనే ప్రధాని మోదీ లక్ష్యం
- 'ధన ధాన్య కృషి యోజన' ప్రారంభంలో మంత్రి అచ్చెన్న

గుంటూరు/ అమరావతి (చైతన్య రథం): రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి పునాది అని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని డబల్ ఇంజన్ సర్కార్ రైతులకు మేలు చేసే కార్యక్రమాల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సేద్యం మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం గుంటూరు లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృష్ణా అడిటోరియంలో న్యూఢిల్లీనుంచి ప్రధాని నరేంద్రమోదీ పీఎం ధన్ -ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మనిర్భరత మిషన్ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పీఎం ధన్ ధాన్య యోజన రైతుల ఆర్థికశంక్తివంతానికి దారితీస్తుందని, పప్పుధాన్య ఆత్మనిర్భరత మిషన్ ప్రొటీన్ భద్రతలో స్వయం సమృద్ధి దిశగా పెద్ద అడుగు అని అన్నారు. దేశవ్యాప్తంగా రూ.42,000 కోట్లు విలువైన వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక తదితర అనుబంధ రంగాలకు చెందిన ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నారన్నారు. అదేవిధంగా పీఎం ధన్ -ధాన్య కృషి యోజన ద్వారా దేశంలో 100 జిల్లాల్లో వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి రైతులకు కేంద్ర ప్రభుత్వం 30 పథకాల ద్వారా ప్రోత్సాహాన్ని అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని, పంటల వైవిధ్యంతో రైతుల ఆదాయం రెట్టింపు లక్ష్యమని, ప్రధాని మోదీ దృష్టిలో ప్రతి రైతు సమృద్ధి భవిష్యత్తు చిహ్నమన్నారు. పీఎం ధన్ -ధాన్య కృషి యోజనలో రాష్ట్రంలో ఎంపికైన అల్లూరి సీతారామరాజు, అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాలలో రానున్న ఆరేళ్ల అవస్థాపన సౌకర్యాలపై దృష్టిపెట్టి వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉత్పత్తుల పెంపు, నాణ్యతపై దృష్టి, పంట అనంతరం నష్టాలు తగ్గించడం ప్రధాన లక్ష్యంగా వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తారన్నారు. పప్పు ధాన్యాల ఉత్పత్తి-ఉత్పాదక పెంచటంపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటారని తెలిపారు. దేశంలో ఆహార ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించటం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆహార అలవాట్లు మారిన నేపథ్యంలో ప్రొటీన్‌తో కూడిన పప్పు ధాన్యాలను ప్రజలకు అందచేయటానికి పప్పుధాన్యాల మిషన్ ద్వారా సాగును ప్రోత్సహించనున్నారన్నారు.



### చివర గింజవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

రైతులు సాగుచేసిన పప్పు ధాన్యాలను చివరి గింజ వరకు మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అచ్చెన్నాయుడు భరోసానిచ్చారు. రైతులకు అధిక దిగుబడి విత్తనాలు, ఆధునిక సాంకేతిక సాయం, మార్కెట్ అనుసంధానం లభించనుందన్నారు. ప్రతి ఎకరా రైతు ధనవంతుడవ్వాలనే సంకల్పంతో ఈ పథకాలు ప్రారంభించారని తెలిపారు. పంట నష్టాలకు భరోసా -మార్కెట్ సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అన్నారు. రైతులు పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్న రైతులను ఆనందంగా ఉంచడానికి అన్ని సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి ముందుకు వెళుతున్నామన్నారు. రైతులు ఇబ్బంది పడకూడదని బర్లీ పొగాకును రూ.270 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని, మామిడి, కోకో, ఉల్లిని మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు మేలు చేసిందన్నారు. రైతులనుంచి సీసీఐ ద్వారా సక్రమంగా పత్తి కొనుగోలుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

### పంటల మార్పిడికి రైతులు ముందుకురావాలి

రైతులు ఒకే విధమైన పంటలను సాగు చేయకుండా ప్రకృతి సాగు పద్ధతులను అవలంబించాలన్నారు. విదేశాలకు ఎగుమతులకు వీలుగా పంట ఉత్పత్తుల్లో నాణ్యతను పెంపొందించే సాగు విధానాలను పాటించాలన్నారు. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అవసరమైన పూర్తి సహాయ సహకారాలను నిరంతరం అందిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రతి ఎకరా రైతు ధనవంతుడవ్వాలని, ధాన్య పంటలతోపాటు పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచి, దేశాన్ని ఆహార భద్రతలో స్వావలంబన దిశగా తీసుకెళ్లడం ప్రధాని లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, పంటల వైవిధ్యాన్ని పెంచి, ఆదాయాలను రెట్టింపు చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రైతు కష్టాన్ని గౌరవిస్తుందని, మార్కెట్ సదుపాయాలు కల్పించడం, పంట నష్టాలకు భరోసా ఇవ్వడం ఇవన్నీ ఎన్డీయే ప్రభుత్వ ప్రాధాన్యతలుగా వివరించారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రైతును రాజుగా చేయాలని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు అందించడంతోపాటు సకాలంలో ఎరువులు, విత్తనాలను పంపిణీ చేస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. రైతు కుటుంబ ఆదాయాన్ని రెండింతలు చేసేలా 2047 విజన్‌లో భాగంగా 360 డిగ్రీలో రైతులకు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎక్స్‌అఫిషియో సెక్రటరీ బి రాజశేఖర్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్శిటీ ఉప కులపతి ఆర్ శారద జయలక్ష్మి దేవి, పౌర సరఫరాల సంస్థ వీసీ అండ్ యండీ ఎస్ ఢిల్లీరావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, వివిధ విభాగాల అధికార్లు, రైతులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకు పెద్దపీట



- దుర్గమ్మ సేవాభాగ్యాన్ని సద్వినియోగపర్చుకోండి
- సీఎం ఆశయాలకు అనుగుణంగా సేవలందించాలి
- పాలక మండలి చైర్మన్, సభ్యులకు మంత్రి సూచన
- కొత్త పాలకమండలికి కొలుసు అభినందనలు

విజయవాడ (చైతన్య రథం): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం పాలక మండలి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొర్రా రాధాకృష్ణ (గాంధీ), సభ్యులను రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారధి, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య శనివారం ఉదయం దుర్గగుడిలో కలిసి అభినందించారు. దుర్గ గుడి పాలక మండలి ఛైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ (గాంధీ)ని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దుర్గమ్మకు సేవ చేసే అవకాశం చైర్మన్‌కు, సభ్యులకు కల్పించారని దానిని సద్వినియోగం చేసుకుని సీఎం ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం పాలక మండలిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేలా భక్తులకు సేవలు అందించాలన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు పెద్ద పీట వేయాలని మంత్రి కొలుసు పార్థసారథి, చైర్మన్, సభ్యులకు సూచించారు.

# మీ బిడ్డ ఆరోగ్య బాధ్యత మాది

## నరసింహారావు తల్లిదండ్రులకు మంత్రి సవిత భరోసా

మంగళగిరి (చైతన్య రథం): 'మీ బిడ్డ ఆరోగ్య బాధ్యత మాది. మీ బిడ్డ కోలుకునేలా మెరుగైన వైద్యమందిస్తాం.. అధైర్యపడొద్దు' అంటూ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న అన్నపర్రు బీసీ హాస్టల్ విద్యార్థి నరసింహారావు తల్లిదండ్రులకు బీసీ సంక్షేమ మంత్రి ఎస్ సవిత భరోసానిచ్చారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బీసీ హాస్టల్ విద్యార్థి నరసింహకు మెరుగైన వైద్యం కోసం మంత్రి సవిత ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు శనివారం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థిని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణతో కలిసి మంత్రి సవిత పరామర్శించారు. నరసింహా ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలగురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి తక్షణమే కోలుకునేలా వైద్య సేవలందించాలని మంత్రి సవిత తెలిపారు. ఎయిమ్స్ డైరెక్టర్ నటరాజన్‌తోనూ మంత్రి సవిత ఫోన్‌లో మాట్లాడారు. మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. విద్యార్థి



ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని ఆయన మంత్రికి తెలిపారు. అక్కడే ఉన్న విద్యార్థి తల్లిదండ్రులు గురవయ్య, సుజాతను మంత్రి పరామర్శిస్తూ 'మీ బిడ్డకు మెరుగైన వైద్యం అందిస్తాం. మీ బిడ్డ ఆరోగ్య బాధ్యత మాది. అధైర్యపడొద్దు' అంటూ ధైర్యం చెప్పారు. విద్యార్థి ఆరోగ్యం మెరుగుపడే వరకూ ఆసుపత్రిలోనే బీసీ సంక్షేమ శాఖాధికారులు ఉండాలని మంత్రి సవిత ఆదేశించారు. మంత్రి సవితవెంట జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి మయూరి, ఇతర అధికారులు ఉన్నారు.

### 'బీకేటీ'ని సందర్శించిన డోలా

#### యాజమాన్యానికి ధైర్యం చెప్పిన మంత్రి

ప్రకాశం/ సింగరాయకొండ (చైతన్య రథం): సింగరాయకొండ మండలం కలికవాయిలో అగ్ని ప్రమాదానికి గురైన బీకేటీ పొగాకు కంపెనీని శనివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సందర్శించారు.

ఈ సందర్భంగా ప్రమాదంలో కాలిపోయిన పొగాకును మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... కంపెనీలో అగ్ని ప్రమాదం సంభవించడం దురదృష్టకరమన్నారు. ప్రమాదంలో రూ.600 కోట్ల విలువైన పొగాకు కాలిపోయింది. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఘటనపై మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు ఆరా తీశారు. బీకేటి కంపెనీకి ప్రభుత్వం తరపున సాయం అందిస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.



# దిగుమతులపై ఆధారపడొద్దు

## పప్పుధాన్యాల సాగు పెరగాలి - ప్రధాని మోదీ పిలుపు



దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రిధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు కనీసం రోడ్లు కూడా వేయించలేదన్నారు. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయని అన్నారు.

## బిహార్ ఎన్నికల్లో కళాకాంతులు

### వివిధ పార్టీల నుంచి బరిలోకి కళాకారులు



సంస్కృతి, సంప్రదాయాలకు భోజ్ పురి పాటలు పెట్టింది పేరు. అక్కడి ప్రజల్లోనూ వీటికి విపరీతమైన క్రేజ్ ఉంటుంది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల సమయం లోనూ 'జానపదం' తనదైన ముద్ర వేసుకుంటోంది. అనేక మంది పాపులర్ గాయనీ గాయ కులు ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధమవుతున్నారు.అన్ని పార్టీలూ వీరిని రంగంలోకి దించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

**మైథిలీ నుంచి శిల్పి వరకు..**

భాజపా నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రముఖ జానపద గాయని మైథిలీ ఠాకుర్ (25) ఇప్పటికే వెల్లడించారు. భాజపా సీనియర్ నేతలు వినోద్ తావ్డే కేంద్ర మంత్రి నిత్యానంద రాయలతో భేటీ అనంతరం ఈ యువ గాయని మీడియాతో మాట్లాడారు. ఇది తనకు భిన్నమైన ప్రయాణమని.. ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. మరో ప్రముఖ గాయని శిల్పి రాజ్ కూడా కేంద్ర మంత్రి, రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్‌తో భేటీ అయ్యారు. దీంతో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేయొచ్చనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. ప్రశాంత్ కిశోర్ సారథ్యంలోని జన్ సురాజ్ పార్టీ కూడా భోజ్ పురీ గాయకుడు రితేష్ రంజన్ పాండేను కర్గహర్ స్థానం అభ్యర్థిగా ప్రకటించింది. తాను ఈ నేలలోనే పుట్టి పెరిగానని, కళాకారుడిగా ఇక్కడ తరచూ పర్యటిస్తుంటానని చెప్పారు. ఎన్నికల్లో స్థానిక ప్రజల మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాపులర్ భోజ్ పురీ గాయకుడు అలోక్ కుమార్ కూడా ఇటీవలే జన్ సురాజ్‌లో చేరారు. ఎన్నికల్లో పోటీ చేసే ఉద్దేశం లేదని, రాష్ట్రంపై ప్రశాంత్ కిశోర్‌కు ఉన్న దార్శనికత కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలని పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే మాత్రం ఆలోచిస్తానని చెప్పారు. కళాకారులు పార్టీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు.

# మాకు 'దారి' చూపించండి!



- అక్రమ నిర్మాణాలు, మార్గం మూసివేతపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- వైసీపీ నేత బుర్రా శివారెడ్డి భూదందా.. 'ఫోర్జరీ'తో భూ బదిలీ
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన అనూరాధ, రాజశేఖర్

మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణలో పలువురు తమ సమస్యలు చెప్పుకుని, పరిష్కారం చూపాలంటూ అర్జీలు సమర్పించారు. శనివారంనాటి కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్ రాజశేఖర్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి.. తక్షణం పరిష్కారమయ్యే సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశారు. అల్లూరిజిల్లా ఎటపాకకు చెందిన నవీన్ అర్జీని సమర్పిస్తూ.. 'మండి పూడి వెంకటరత్నం అనే వ్యక్తి ఎటపాక రెవెన్యూ గ్రామంలో ఇటుకల ఫ్యాక్టరీ పెట్టాడు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఫ్యాక్టరీ నడపడమే కాకుండా.. తమ పొలానికి వెళ్లేందుకు దారిలేకుండా చేశాడు. కరకట్టమీద ఇల్లు కట్టి, కరకట్ట నుండి బయటకు వెళ్లే డ్రైనేజీ కాల్వను సైతం పూడ్చివేశాడు. దీనిపై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వాస్తవాలను పరిశీలించి ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలి' అంటూ అర్జీలో కోరాడు.

ఎన్టీఆర్ జిల్లా కంకిపాడుకు చెందిన గుంటకా వెంకట రామిరెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇస్తూ.. 'భార్య సీతామాలక్ష్మి పేరిట తాడికొండ సర్వేనెం.73లో 2.68 ఎకరాల భూమి ఉంది. మా చిన్న అల్లుడు, వైసీపీ తుళ్ళూరు మండల కార్యదర్శి బుర్రా వెంకటశివారెడ్డి రాజకీయ పలుకుబడితో ఫోర్జరీ పత్రాలు పుట్టించి భూమిని తన భార్య బుర్రా శ్రీలక్ష్మి పేరుకు మార్చుకున్నాడు. తహసీల్దారు మా అనుమతి లేకుండా మ్యుటేషన్, ఆర్ఓఆర్., 1బి అడంగల్ జారీ చేశారు. దీనిపై కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినా ఇంతవరకూ ఎలాంటి చర్యలూ లేవు. గతంలోనే ఇదే వ్యక్తులు గోళ్లమూడి గ్రామంలోని 0-97 సెంట్ల భూమిని తాను బ్రతికుండగానే డెత్ సర్టిఫికేట్ సృష్టించి అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. కావునా వారిపై చర్యలు తీసుకోని తాడికొండ భూమి విషయం లో తన అనుమతి లేకుండా ఎలాంటి లావాదేవీలు జరగకుండా ఉండేలా చూడాలి' అని వేడుకున్నారు.

కర్నూలు జిల్లా కల్లూరు మండలం సోమిరెడ్డి నగర్‌కు చెందిన నారాయణ గ్రీవెన్స్‌లో అర్జీనిస్తూ.. "ఇండియన్ ఆర్మీలో 22 ఏళ్లు దేశానికి సిపాయిగా సేవలందించి రిటైర్డ్ అయ్యాను. 2011లో జిల్లా కలెక్టర్ లెటర్ ద్వారా ఓర్వకల్లు మండల బ్రాహ్మణపల్లిలో సర్వే నె.20/బీ, ఖాతా నెంబర్ 187 ద్వారా 5 ఎకరాల భూమి ఇవ్వడం జరిగింది. తన పేరుపై ఆన్‌లైన్‌లోకి ఎక్కించి పాస్ బుక్ సైతం ఇచ్చారు. దానిని సాగు చేసుకుంటున్నాను. ఏటా ప్రభుత్వం ఇస్తోన్న అన్నదాత సుఖీభవ కూడా జమవుతుంది. అయితే ప్రస్తుతం సాగుబడిలో ఉన్న 5 ఎకరాల పొలం ఏపీఐఐసీ కర్నూలు జోనల్ ఆఫీస్‌కి అప్పగించారు. కనుక నా బతుకుదెరువైన పొలం నాకు ఇప్పించి న్యాయం చేయండి" అని కోరాడు.

అల్లూరి జిల్లా ఎటపాకకు చెందిన సంపత్ గ్రీవెన్స్‌లో అర్జీ నిస్తూ.. "గుండాల పంచాయతీ పరిధిలో ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉన్న 1.61 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకలో సుమారు 30 వేల టన్నులు అక్రమంగా రవాణా చేస్తున్నారు. విహారి ట్రాన్స్‌పోర్ట్ (వేణు) ఆధ్వర్యంలో తెలంగాణకు ఇసుకను భారీగా అమ్మి తరలిస్తున్నారు.

డిపో-1 వద్ద సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, జీపీఎస్ ట్రాకింగ్ వివరాలు దాచిపెట్టడం, జీరో బిల్లులపై లారీలు రవాణా చేయడంలాంటి అవకతవకలు బయటపడుతున్నాయి. తహసీల్దార్, మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి" అని కోరాడు. వీటితోపాటు పలువురు పింఛన్ సమస్యలపై అర్జీలిచ్చి పరిష్కరించాలని కోరారు. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అర్జీలు సమర్పించారు. సమస్యలను క్షణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్ రాజశేఖర్‌లు బాధితవర్గాలకు హామీనిచ్చారు.



# ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): ప్రజల కోసమే ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని, ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, ప్రజల నుంచి వస్తున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో శనివారం నాడు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమానికి 5 మండలాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యలను తెలియజేశారు. భూ సమస్యలు పరిష్కరించాలని, వికలాంగులు తమకి పెన్షన్ మంజూరు చేసి తమను ఆదుకోవాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకి వినతులు ఇచ్చారు. ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చిన వినతులపై సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి అండగా నిలుస్తుంది



ఉంగుటూరు (చైతన్యరథం): ఆపద సమయంలో పేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఆప్కాబ్ ఛైర్మన్ జి.వీరాంజనేయులు పేర్కొన్నారు. భీమడోలులోని తన క్యాంపు కార్యాలయంలో 21 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.12,89,138 విలువైన చెక్కులను శనివారం అందజేశారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతల వాసు, టీడీపీ ఉంగుటూరు మండల అధ్యక్షుడు వేములపల్లి సుధీర్, సొసైటీ ఛైర్మన్ కడియాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇకనైనా రాజకీయాలు ఆపి... అభివృద్ధి గురించి ఆలోచించండి : కళా వెంకట్రావు



విజయనగరం (చైతన్యరథం): ఏపీలో అభివృద్ధికి మాజీ సీఎం జగన్ అడ్డుగోడలా మారుతున్నారని మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు విమర్శించారు. జగన్ రెడ్డి అధికారంలో ఉన్నా... ప్రతిపక్షంలో ఉన్నా విధ్వంసమే జరగుతోందని మండిపడ్డారు. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను అడ్డుకోవడమే జగన్ పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ, అనకాపల్లిలో పర్యటన పేరుతో విధ్వంసం సృష్టించాలని ప్రయత్నించారని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, ఇదంతా చూస్తుంటే మళ్లీ అధికారంలోకి రాలేనేమోననే భయం జగన్కు పట్టుకుందన్నారు. ఉత్తరాంధ్రలో గత ఐదేళ్లలో వైకాపా చేసిందేమీ లేదని.. ఇకనైనా రాజకీయాలు మానేసి అభివృద్ధి గురించి మాట్లాడండని హితవు పలికారు.

# ఇకనైనా రాజకీయాలు ఆపి... అభివృద్ధి గురించి



బొబ్బిలి (చైతన్యరథం): తెర్లాం ప్రధాన రహదారికి మరమ్మతులు చేయడానికి బొబ్బిలి మండలం అలజంగి వద్ద ఎమ్మెల్యే బేబీ నాయన శంకుస్థాపన చేశారు. ఈ పనులకు ప్రభుత్వం రూ. 4.50 కోట్ల మంజూరు చేసిందన్నారు. గుంతల వల్ల చాలాకాలంగా ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బుడా ఛైర్మన్ లక్ష్మంనాయుడు ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ మద్యాన్ని ప్రోత్సహించిందే జగనే: ఎమ్మెల్యే కూన

**• నేరస్తుల అడ్డా వైసీపీ... దానికి గౌవర అధ్యక్షుడు జగన్ అంటూ మండిపాటు**

ఆముదాలవలస (చైతన్యరథం): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డివి వింత పోకడలని... చిల్లర వ్యక్తులులాగా ప్రవర్తించారని మండిపడ్డారు. గడిచిన 75 ఏళ్ళ భారత చరిత్రలో కల్తీ మద్యానికి మూల విరాట్ జగన్ అని అన్నారు. కల్తీ మద్యాన్ని ప్రవేశ పెట్టింది జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనే అని వ్యాఖ్యలు చేశారు. కల్తీ మద్యానికి సూత్రధారి ఎక్కడ అంటే తాడేపల్లి పాలస్ అని అన్నారు. కల్తీ మద్యం అమ్మించి వేలాది రూపాయలు దోపిడి చేశారని.. వాటితో షెల్ కంపెనీల ద్వారా వ్యాపారం చేశారని... మనీ లాండరింగ్ చేశారని ఆరోపించారు. దమ్ముంటే కల్తీ మద్యంపై చర్చకు రావాలని జగన్‌కు ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

**వారిని ప్రోత్సహించింది జగన్...**

నేరస్తుల అడ్డా వైసీపీ అని... నేరస్థులకు పేటెంట్ వైసీపీ నాయకులని.. దానికి గౌరవ అధ్యక్షుడు జగన్ అంటూ వ్యాఖ్యాలు చేశారు. కల్తీ మద్యాన్ని తయారు చేసి అమ్మినవాళ్ళకి సీట్లు ఇచ్చి, పదవులు ఇచ్చిన కల్తీ పార్టీ వైసీపీ అంటూ దుయ్యబట్టారు. కల్తీ మద్యంలో ఉన్న కుట్రదారులను ప్రోత్సహించింది జగన్ అని ఆరోపించారు. వైసీపీ హయాంలో మల్లాది విష్ణు బార్‌లో కల్తీ మద్యం తాగి చనిపోతే వారికి పదవులు ఇచ్చారని... తమరి హయాంలో జరిగిన కల్తీ మద్యం కేసు వాస్తవం కాదా అని జగన్‌ను ప్రశ్నించారు కూన రవికుమార్. వైసీపీ హయాంలో అమ్మిన మద్యంలో క్రిమిసంహారక మందులున్నాయని అమెరికా, ఇతర ప్రయోగశాలల్లో జరిగిన పరిశోధనల్లో సర్టిఫికెట్స్ వచ్చాయని వెల్లడించారు. అవి తాగి లక్షలాది మంది ప్రాణాలు పోయాయన్నారు.

# విజయవాడను మోడల్ అభివృద్ధి నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు

**●విజయవాడ నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ఐఆర్డిపిఆర్ - కేశినేని ఫౌండేషన్ ఒప్పందం**

**●తొలి విడతలో ఏ.కొండూరు, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల ఎంపిక**

**●సుస్థిర వ్యవసాయం, ఉపాధి సృష్టి, నైపుణ్యాభివృద్ధి ప్రధాన లక్ష్యాలు**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక మోడల్ అభివృద్ధి నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతి రాజ్ (NIRDPR), కేశినేని ఫౌండేషన్ మధ్య శనివారం హైదరాబాదులో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ మేరకు అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది. ఈ ఒప్పందంపై ఎన్ఐఆర్డిపిఆర్ తరపున సీనియర్ కన్సల్టెంట్ డా. మొహమ్మద్ ఖాన్, కేశినేని ఫౌండేషన్ తరపున విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి మోడల్‌గా మార్చి, దేశానికి ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌గా నిలబెట్టడమే మా లక్ష్యం. ఇందుకోసం గ్రామీణాభివృద్ధి, ఉపాధి సృష్టి, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, సుస్థిర వ్యవసాయం వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నాం," అని పేర్కొన్నారు. విజయవాడలో ప్రతి గ్రామం, ప్రతి వాడ అభివృద్ధి చెందేలా ఎన్ఐఆర్డిపిఆర్ సాంకేతిక సహకారంతో కేశినేని ఫౌండేషన్ పలు కార్యక్రమాలను చేపడుతుందని ఆయన వివరించారు.

**మొదటి విడతలో మూడు మండలాలు**

ప్రాజెక్టు మొదటి దశలో ఏ.కొండూరు, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాలను ఎంపిక చేశారు. ఈ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా పలు ప్రాజెక్టులు అమలు కానున్నాయి. కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేయడం, ఆర్గానిక్ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, హ్యాండ్‌మేడ్ పేపర్ ప్రొడక్షన్, సీడ్ బ్యాంకులు, నేచురల్ ఫార్మింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు వంటి కార్యక్రమాలను అమలు చేయనున్నారు. అభివృద్ధి ప్రణాళికలో స్థానిక పంచాయతీలు, మండల అధికారులు, యువజన సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు భాగస్వామ్యం అవుతాయని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

**లోకల్ అడ్మినిస్ట్రేషన్‌తో వర్క్‌షాప్**

ఎన్ఐఆర్డిపిఆర్ తరపున అక్టోబరు 22న స్థానిక పరిపాలన అధికారులతో కలిసి ఒక ఫీజిబిలిటీ మరియు వైయబిలిటీ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఇందులో ప్రాజెక్టు అమలు విధానం, ఫీల్డ్ లెవెల్ టీమ్‌ల ఏర్పాటుపై చర్చించనున్నారు . ఈ వర్క్‌షాప్ ద్వారా ప్రతి మండలానికి ప్రత్యేక అభివృద్ధి పథకాలు సిద్ధం చేయాలని నిర్ణయించారు.

**సమన్వయ కమిటీ ఏర్పాటు**

ఎంఓయు నిబంధనల ప్రకారం ఎన్ఐఆర్డిపిఆర్ తరపున డా.మొహమ్మద్ ఖాన్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. కేశినేని ఫౌండేషన్ తరపున కూడా ప్రతినిధిని నియమించనున్నారు. ప్రాజెక్టు అమలు పర్యవేక్షణ, డేటా సేకరణ, ప్రగతి అంచనా తదితర పనులను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఐఆర్డిపిఆర్ డైరెక్టర్ జనరల్ డా.జి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ... విజయవాడ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన ఎంపీ కేశినేని శివనాథ్‌ను అభినందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువు అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జీఎస్టీ ప్రతి కుటుంబం లబ్ధి పొందాలి : ఎమ్మెల్యే గద్దె



విజయవాడ (చైతన్యరథం): జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల తగ్గిన పన్నుల లబ్ధిని రాష్ట్రంలోని ప్రతికుటుంబం పొందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఈసంస్కరణలపై ప్రజలకు అవగాహన కోసం రాష్ట్ర వ్యాప్తితంగా నెల రోజులు పాటు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని ఆటోనగర్ ఎగ్జిబిషన్ హాలులో ఏర్పాటైన సూపర్ జీఎస్టీ.... సూపర్ సేవింగ్స్ పేరుతో జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల తగ్గిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన వాటాలో రూ. 8వేల కోట్లు తగ్గుతుందని, అయినా ప్రజల మేలు కోసం సీఎం చంద్రబాబు దీనిని అమలుచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ జీఎస్టీ విజయవాడ జాయింట్ కమిషనర్ ఎస్. ప్రశాంతకుమార్, డీసీలు కె. అపర్ణ, ఎస్‌కే జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతం

- విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్‌తో సహా మూడు డేటా సెంటర్లు
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్న పారిశ్రామికవేత్తలు
- కూటమిలో అందరూ కలిసే ఉంటాం ఎవరూ విడదీయలేరు : ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి



రాజమహేంద్రవరం (చైతన్యరథం) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో వేగంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పరిశ్రమలు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు వస్తున్నారని టిడిపి సీనియర్ నేత, రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా నెరవేరుస్తున్నామన్నారు. శనివారం ఉదయం గోరంట్ల తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విశాఖకు గూగూల్‌తో సహ మూడు డేటా సెంటర్లు వస్తావున్నాయని, దీనివలన లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషికి ప్రధాని మోడీ కూడా అండగా ఉండడంతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని గోరంట్ల పేర్కొన్నారు. సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అయిందని, తల్లికి వదనం ఎంతమంది పిల్లలు ఉంటె అంతమందికి వేశామని గోరంట్ల చెప్పారు. స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని, మరోపక్క ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేటు పెంచడానికి చర్యలు కూడా ప్రభుత్వం తీసుకుంటోందని ఆయన చెప్పారు. ఇందుకోసం ఎలక్ట్రిక్ బస్సులు కొనాలనే యోచన చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత బస్సువలన ఆటో డ్రైవర్లకు ఇబ్బంది లేదని, మారుమూల ఇరుకు ప్రాంతాలకు వెళ్లాలంటే ఆటోలు కావాల్సిందేనని ఆయన చెప్పారు. అలాగే ఆటో డ్రైవర్లకు రూ 15వేలు చొప్పున అందజేయడంతో పాటు వారిపై ఎలాంటి కేసులు, పెనాల్టీలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని గోరంట్ల చెప్పారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని గోరంట్ల అన్నారు. అందుకే ముందుగానే చెప్పినట్లు ప్రజాసమస్యలు అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి, తామే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని ఆయన స్పష్టం చేసారు. దీన్ని కూడా కొంతమంది అపోహలు సృష్టించేలా సోషల్ మీడియాలో లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని, వైసిపి వాళ్ళు ఇదే అదనుగా భావించి, ఆజ్యం పోస్తున్నారని ఆయన అన్నారు. వైసిపి వాళ్ళది విడగొట్టి లబ్ధిపొందాలనే శాడిజమని, ప్రతి విషయానికి బూతులే వాడుతున్నారని, ఇంకా వాళ్ళు తీరు మారలేదని ఆయన మండిపడ్డారు. ఎన్ని దుష్ప్రచారాలు చేసినా కూటమి ఐక్యతకు ఇబ్బంది లేదని ఆయన స్పష్టం చేసారు. అసెంబ్లీలో లేవనెత్తిన అంశాలను ప్రస్తావిస్తూ, అధికారులు చెప్పిందే కాకుండా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని అడిగానని, ఇలా అడగడం తప్పేం కాదే అన్నారు. 1985నుంచీ తనకు ఇది అలవాటేనని ఆయన గుర్తుచేసారు. అసెంబ్లీలో తన ప్రసంగం, అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తనను అభినందిస్తూ చేసిన ప్రసంగ క్లిప్పింగ్స్ చూపిస్తూ, వాయిస్ వినిపించారు.

పిపిపి విధానం తప్పని, తాము అడ్డుకుంటామని జగన్ అనడం తగదని గోరంట్ల విమర్శించారు. మెడికల్ కాలేజీలకు భూములు కేటాయించినా అన్నింటికీ నిధులు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. పిపిపి ద్వారాచేయడం వలన వెయ్యి సీట్లు వస్తాయని ఆయన అన్నారు. పిపిపి విధానం వ్యతిరేకిస్తున్న జగన్ గతంలో కృష్ణపట్నం పోర్టుల వంటివి ప్రైవేటు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. దళితుడిని మర్డర్ చేసి డోర్ డెలివరీ చేసిన వంటి వాళ్ళను చంకలో పెట్టుకున్న జగన్ హత్యా రాజకీయాలు చేసినవాళ్లను ప్రోత్సహించారని గోరంట్ల ధ్వజమెత్తారు. దోచుకున్న సొమ్మంతా ఖర్చు చేస్తూ 13ఏళ్ళ నుంచి బెయిల్ మీద తిరుగుతున్న తీరుని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని జగన్ దివాళా తీయించి, అభివృద్ధి లేకుండా చేసారని, వైసిపి వాళ్ళ చేసిన తప్పులను సరిదిద్దుతూ ఒక్కొక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేసుకుంటూ వస్తోందని ఆయన అన్నారు.

ఆరోగ్యశ్రీకి , సీఎం రిలీఫ్ ఫండ్‌కి సంబంధం లేదని గోరంట్ల ఒక ప్రశ్నకు సమాధానంగా స్పష్టంచేసారు. ఆరోగ్యశ్రీకి బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని, సీఎం రిలీఫ్ ఫండ్‌కి వేరే ద్వారా నిధులు వస్తాయని ఆయన అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోతే కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లిస్తోందన్నారు. అయినా పళ్ళున్న చెట్టుకే రాళ్లదెబ్బలు అన్న చందంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

రూరల్ నియోజక వర్గంలో 212మందికి 2కోట్ల 40లక్షలకు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ కింద సాయం అందించినట్లు ఆయన చెప్పారు. కానిస్టేబులు ఉద్యోగాల భర్తీ , డీఎస్సీ తీయడం, మళ్ళీ డీఎస్సీకి కసరత్తు చేయడం, వంటి చర్యల వలన ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపడ్డాయని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల కల్పన జరుగుతోందని గోరంట్ల అన్నారు. రూరల్ నియోజక వర్గంలో మరో 9కోట్ల 20లక్షల రూపాయల పనులకు నిధులు విడుదల అయ్యాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్, రాజమహేంద్రవరం రూరల్ మండలం టీడీపీ అధ్యక్షులు మత్సేటి శివ సత్య ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ మార్ని వాసుదేవ్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పండూరి అప్పారావు, నున్న కృష్ణ, తలారి మూర్తి, శీలం గోవింద్, కొప్పిశెట్టి చిన్ని, రొంపిచర్ల యాంటోని, ఏడాకుల వెంకటేశ్వరరావు, కక్కల రమేష్, చిట్టిబోయిన శ్రీనివాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# మీ బిడ్డ ఆరోగ్య బాధ్యత మాది : మంత్రి సవిత భరోసా



మంగళగిరి (చైతన్యరథం): 'మీ బిడ్డ ఆరోగ్య బాధ్యత మాది.. మీ బిడ్డ కోలుకునేలా మెరుగైన వైద్యమందిస్తాం.. మీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది... అధైర్యపడొద్దు' అంటూ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న అన్నప్రు బీసీ హాస్టల్ విద్యార్థి నరసింహరావు తల్లిదండ్రులకు రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత భరోసా ఇచ్చారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బీసీ హాస్టల్ విద్యార్థి నరసింహకు మెరుగైన వైద్యం కోసం మంత్రి సవిత ఆదేశాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు శనివారం ఎయిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థిని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణతో కలిసి మంత్రి సవిత పరామర్శించారు. నరసింహా ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవల గురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి తక్షణమే కోలుకునేలా వైద్య సేవలందించాలని మంత్రి సవిత తెలిపారు. ఎయిమ్స్ డైరెక్టర్ నటరాజన్‌తోనూ మంత్రి సవిత ఫోన్లో మాట్లాడారు. మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని ఆయన తెలిపారు. అక్కడే ఉన్నవిద్యార్థి తల్లిదండ్రులు గురవయ్య, సుజాతను మంత్రి పరామర్శిస్తూ ఓదార్చారు. 'మీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంది... మీ బిడ్డకు మెరుగైన వైద్యం అందిస్తాం... మీ ఆరోగ్య బాధ్యత... అధైర్యపడొద్దు' అంటూ భరోసా ఇచ్చారు. విద్యార్థి ఆరోగ్యం మెరుగుపడే వరకూ ఆసుపత్రిలోనే బీసీ సంక్షేమ శాఖాధికారులు ఉండాలని మంత్రి సవిత ఆదేశించారు. మంత్రి సవిత వెంట జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి మయూరి, ఇతర అధికారులు ఉన్నారు.

# సమాజానికి గురువులే ఆదర్శం

- డీఎస్సీ సాధించిన అభ్యర్థులను సత్కరించిన చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్




జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): గురువులు సమాజానికి ఆదర్శమని, ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వంలో గురువులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడితే, మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మన ప్రియతమ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలో నూతన ఉపాధ్యాయులను నియమించారని అన్నారు. శనివారం జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఆలపాటి గంగ భవాని ఫంక్షన్ హాల్ నందు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చింతలపూడి నియోజకవర్గంలో డీఎస్సీలో విజయం సాధించి ఉపాధ్యాయులుగా నియమితులైన వారిని ఎమ్మెల్యే జ్ఞాపకాలు తోపాటు సాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి, ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో నాకు అత్యంత ఇష్టమైనది ఉపాధ్యాయ వృత్తి అని, ఒక ఉపాధ్యాయుడు సమాజాన్ని తీర్చిదిద్దగలరని విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చగలరని మన చింతలపూడి నియోజకవర్గంలో.150.మంది కొత్త ఉపాధ్యాయులు ఎంపిక కావడం పూర్వజన్మ సుకృతం మీరందరూ ఉత్తమ ఉపాధ్యాయులకు నిలిచి విద్యార్థులకు వెలుగులు నిచ్చే మార్గదర్శకులుగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లతోపాటు ఉపాధ్యులతోపాటు నాలుగు మండలాల కూటమి నాయకులు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు గ్రామ నాయకులు వరకు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ - సూపర్ జీఎస్టీపై అవగాహన

- కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు (చైతన్యరథం): సూపర్ సిక్స్ – సూపర్ జీఎస్టీపై ప్రజలకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. శనివారం తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామంలో నిర్వహించిన జీఎస్టీపై అవగాహన కార్యక్రమం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలలు రోజు వాడే వస్తువులపై జీఎస్టీ తగ్గించి పేదలకు కొంత భారం తగ్గించాలనే ఉద్దేశంతో 373 రకాల వస్తువుల మీద జీఎస్టీ తగ్గించరన్నారు. ప్రాణావసర మందులు, ఇన్స్యూరెన్స్ వంటి వాటి మీద తగ్గింపుతో ఆనందంలో ప్రజానీకం.ఈ తగ్గింపుతో ప్రజల అవసరాలు తీరటంతో పాటు ఆర్థికంగా బలవంతులను చేయటమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఇప్పటిదాకా పన్నులు పెంచే ప్రభుత్వాలే తప్ప పన్నులు తగ్గించే ప్రభుత్వం మొదటిసారి చూస్తున్నామని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి ముఖ్యనాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆదిరెడ్డికి ముస్లిం మైనారిటీలు కృతజ్ఞతలు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభించడంతో నగరానికి చెందిన ముస్లిం మైనారిటీలు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక 4వ డివిజన్ రాజేంద్రనగర్‌లో ఉన్న బిలాల్ మసీదును పునర్మించేందుకు అక్కడి మసీదు కమిటీ నిర్ణయించింది. అయితే అందుకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్ ఇతర తతంగాలు పూర్తి చేసేందుకు పొజిషన్ సర్టిఫికెట్ కాల్సివచ్చింది. ఈ విషయాన్ని మసీదు కమిటీ, అలాగే స్థానిక టీడీపీ పెద్దలు నక్కా చిట్టిబాబు, నక్కా దేవీవరప్రసాద్, ముస్లిం మైనారిటీ నాయకులు మహ్మద్ అబ్దుల్లా తదితరులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వారి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పొజిషన్ సర్టిఫికెట్ వచ్చేలా చేశారు. అందుకు సంతోషించిన ముస్లిం మైనారిటీ నాయకులు, మసీదు కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు పున నిర్మాణానికి కావాల్సిన అన్ని అనుమతులు వచ్చేలా చేస్తానని, అలాగే మసీదు నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలి

**● ఉపాధ్యాయులకు సూచించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు**



గన్నవరం (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులు సక్రమంగా పాఠాలు బోధించడం లేదంటూ వచ్చిన ఆరోపణలపై స్పందించిన యార్లగడ్డ తక్షణమే విచారణ జరిపి నివేదిక సమర్పించాలని విజయవాడ రూరల్ ఎంఈఓ ఏ. సూరిబాబును ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును, విద్యార్థుల హాజరును, పరిశీలించిన ఆయన విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించి విచారణ నివేదికను ఎమ్మెల్యే వెంకట్రావు కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల హాజరు పెంచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని, ప్రతి ఒక్క విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. గన్నవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విద్యా ప్రమాణాలు మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఉన్నతాధికారులకు సూచించారు.

## స్త్రీ సాధికారతే నిజమైన సమాజాభివృద్ధి

**●శారదా నికేతన్‌లో కొత్త తరగతి గదులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): స్త్రీ సాధికారతే నిజమైన సమాజాభివృద్ధి అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శనివారం బ్రాడీపేట 2/14వ లైన్‌లోని శారదా నికేతన్ స్కూల్ నందు నూతన తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... “శనివారం బాలికా దినోత్సవం సందర్భంలో ఆరు కొత్త గదుల శంకుస్థాపన జరగడం చాలా ప్రాముఖ్యత కలిగిన విషయం. ఇది యాదృచ్ఛికం కాదు, ఇది ఒక సంకేతం. బాలికల విద్యాభివృద్ధి, స్త్రీ సాధికారత పట్ల మన సమాజం చూపుతున్న బాధ్యతకు నిదర్శనం. రాబోయే రోజుల్లో ప్రతి వేదికపై సగం మంది మహిళలు కూడా సమానంగా ఉండే స్థాయికి మనం ఎదగాలన్నారు. “నేను అనేక పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నాను. కానీ శారదానికేతన్ మాత్రం నా హృదయంలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించింది. ఈ విద్యాసంస్థలోకి అడుగు పెట్టినప్పుడల్లా ఒక దేవాలయంలోకి అడుగుపెట్టినట్టు పవిత్రత అనిపిస్తుంది. దీనికి కారణం ఉన్నవ లక్ష్మీనారాయణ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ అనే దంపతులు గుంటూరు కేంద్రంగా జాతీయోద్యమం, స్త్రీ జనోద్ధరణ, సంస్కరణోద్యమాలకు తమ జీవితాలను అంకితం చేశారు. 500 మందికి పైగా విద్యార్థినులు ఉన్న ఈ విద్యాసంస్థలో కొన్ని మౌలిక సదుపాయాలు అవసరమని నాకు తెలియజేశారు. వాటిపై ఇప్పటికే దృష్టి సారించాను. రాబోయే రోజుల్లో అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చేందుకు కృషి చేస్తాను,” అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

## బాధ్యతతో పనిచేస్తా : తాళికోట హరికృష్ణ



విజయవాడ (చైతన్యరథం): వేద పండితుల ఆశీర్వచనాల నడుమ, ఇంద్రకీలాద్రిపై కొలువైన, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యునిగా తాళికోట హరికృష్ణ పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం వేడుకగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ధర్మకర్తల మండలి సభ్యుడు తాళికోట హరికృష్ణ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతతో, భక్తి శ్రద్ధలతో అమ్మవారి ఆజ్ఞగా భావిస్తూ క్రమశిక్షణతో, భయభక్తులతో పనిచేస్తానని అన్నారు. ‘నేను నమ్మే పెద్దమ్మ తల్లి, బతుకమ్మ తల్లి దీవెనతో నా కర్తవ్యాన్ని నిర్వహిస్తా. నా తెలంగాణ ప్రజలకి మరింత సేవలందించే అవకాశం దొరికిందని భావిస్తూ సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా నా ధన్యవాదాలు.’ అని హరికృష్ణ తెలిపారు.

## జీఎస్టీ సంస్కరణలతో అన్నివర్గాలకు ఎనలేని మేలు : ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట (చైతన్యరథం): జీఎస్టీ 2.0 ఫలితాల వల్ల అన్నివర్గాలకు మేలు జరిగిందని, శ్లాబుల తగ్గింపు తాలూకా సంతోషం ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని గడియార స్తంభం కూడలిలో నిర్వహించిన జీఎస్టీ ఉత్సవ్‌లో పాల్గొని, వ్యాపారులు.. వినియోగదారులకు జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపుతో రైతాంగానికి ఎనలేని మేలు జరిగిందని, ట్రాక్టర్లు సహా అనేక సాగు పరికరాల ధరలు బాగా తగ్గాయని ప్రత్తిపాటి చెప్పారు. ప్రజలకు అందించిన సంస్కరణల ఫలితాలపై వారిలో చైతన్యం కలిగించేందుకే ప్రధాని మోదీ ఈ నెల 16న రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో నిర్వహించే జీఎస్టీ సంస్కరణల రోడ్ షో లో పాల్గొంటున్నారని ప్రత్తిపాటి చెప్పారు. మారుమూల గ్రామాల ప్రజలకు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్కరణల ఫలాలు అందాలన్న సదుద్దేశంతోనే ప్రధాని స్వయంగా జీఎస్టీ ఉత్సవ్‌లో పాల్గొంటున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

## సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట (చైతన్యరథం): నియోజకవర్గంలోని వత్సవాయి మండలం, ఇందుగుపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. గ్రామంలోని తేలుకుంట్ల వెంకటి ఇంటి వద్ద నుండి పదిలం గోపాలు ఇంటి వరకు, ఆర్ అండ్ బి రోడ్డు నుండి స్మశానవాటిక వరకు మరియు ఇతర అంతర్గత రహదారులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించడం జరిగింది. అనంతరం గ్రామంలోని ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి కార్యక్రమం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అమలవుతోందని, ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. అలాగే ప్రజల సహకారంతో ప్రతి గ్రామం అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, గ్రామ సర్పంచ్ మొల కృష్ణారావు, ఎంపీటీసీ చావా నాగేశ్వరరావు మరియు గ్రామ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట సంజీవని సీఎంఆర్‌ఎఫ్ : ఎమ్మెల్యే ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధితో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ పెద్ద భరోసా కల్పించడం జరుగుతుందని టీడీపీ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వ్యాఖ్యానించారు. నియోజకవర్గానికి చెందిన 16 మంది ఇటీవల అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకోగా... వారి సంబంధించిన బిల్లులను నియోజకవర్గ ఎమ్మెల్యే లేఖ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించడం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 16 మందికి రూ.7.57 లక్షలు మంజూరైయ్యాయి. శనివారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తన కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అడిగిన వెంటనే సీఎంఆర్‌ఎఫ్ నుంచి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేంద్రమంత్రి పెమ్మసాని భూమి పూజ



తెనాలి (చైతన్యరథం): కొల్లిపర మండలం, అత్తోట గ్రామంలో తన ద్వారా సమీకరించిన సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, సివిల్ సప్లై శాఖ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి గ్రామీణ అభివృద్ధి, సమాచార శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి శనివారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుపుకోవడానికి ముఖ్య కారణం అద్దంకి చిన వీరయ్య సతీమణి నాగరత్నమ్మ అని అన్నారు. కోటి రూపాయల విలువైన వారి స్థలాన్ని ఊరి కోసం ఈ నిర్మాణానికి గానూ అందజేయడం నిజంగా గుర్తుంచుకోదగ్గ అంశమన్నారు. సూదనగుంట రాఘవేంద్రప్రసాద్, ఆయన సతీమణి కళ్యాణి ప్రసాద్ సహకారంతో ఈ నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఆ దంపతులకు ఇక్కడ ప్రాంతంతో ఎలాంటి సంబంధం లేదు. కేవలం అమెరికాలో నాతో ఉన్న సత్సంబంధాల కారణంగా నన్ను నమ్మి 9 కమ్యూనిటీ హాల్ల నిర్మాణానికి గాను రూ.4 కోట్లను నాకు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ముఖ్యమంత్రి పదవి ఏమి కొత్తకాదు. ప్రపంచ దేశాల్లో ఆయన తెలియని వారు లేరు. అయినా సరే రాష్ట్ర ప్రయోజనాల రీత్యా, ప్రజల సంక్షేమం దృష్ట్యా ఒక మెట్టు దిగి మరీ ఆయన రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అలాంటి నాయకుడిని స్ఫూర్తిగా తీసుకొని గ్రామ రాజకీయాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, వచ్చినా రూపు ఆపుకొని పనిచేస్తారని కోరుకుంటున్నాను అని పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు.

ఒక ఆలోచనతో అత్తోట గ్రామంలో ఆదర్శవంతమైన రైతులు స్ఫూర్తిదాయకమైన పద్ధతులతో ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. అత్తోట వ్యవసాయ పద్ధతులను తెలుసుకోవడానికి ఎక్కడెక్కడి నుంచో మన గ్రామానికి వచ్చి వెళ్తుండడం నిజంగా గర్వకారణమన్నారు. అత్తోట గ్రామాన్ని అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని మంత్రి పిలుపునిచ్చారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తోందని, సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వడ్రానం హరిబాబు, గుంటూరు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు చిన్నకోటి రెడ్డి, మండల జనసేన అధ్యక్షులు వెంకయ్యనాయుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వంగసాంబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

### ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు



ఒంగోలు, (చైతన్యరథం): నగరంలోని ప్రకాశం భవన్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుత రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడుతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమంలో మంత్రి స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు కలెక్టర్ రాజాబాబు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, కుటుంబ సభ్యుల వివరాలు, వారు రేషన్ సరుకులు పొందే దుకాణ డీలర్ వివరాలతో ఏటీఎం కార్డు సైజులో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టిందన్నారు. రేషన్ విధానాన్ని పటిష్టపరచి ఎండీయూ వాహనాల స్థానంలో డీలర్ వ్యవస్థను పునరుద్ధరించి వృద్ధులు, వికలాంగుల ఇంటికే నేరుగా రేషన్ సరుకులను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం 16 నెలల కాలంలోనే జిల్లాలో 20వేలకు పైగా కొత్త రేషన్ కార్డును మంజూరు చేసినట్లు చెప్పారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, సరుకులు అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. పెన్షన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం-2, స్త్రీశక్తి, ఆటో డ్రైవర్ల సేవలో వంటి కార్యక్రమాల ద్వారా ఆ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు.

# "ఏపీ మోడల్ ఎడ్యుకేషన్"ను ప్రపంచానికి పరిచయం చేయాలి

### చంద్రన్న పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాల వెల్లువ దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి, (చైతన్యరథం): మండల కేంద్రం ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో శనివారం 2025 మెగా డీఎస్సీ ద్వారా నూతన టీచర్ ఉద్యోగాలు పొందిన నియోజకవర్గం లోని 59 మంది కొత్త టీచర్లకు అభినందనలు తెలియజేసి ప్రతి ఒక్కరినీ దర్శి టిడిపి ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శాలువాతో సత్కరించి, స్వీట్ బాక్స్ అందజేశారు. మాజీ శాసనసభ్యుడు నారపుశెట్టి పాపారావు, నియోజకవర్గంలోని టీడీపీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి 59 మందికి ఉపాధ్యాయ నియామకాలు ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. 1994 నుంచి 2025 వరకు 14 డీఎస్సీల ద్వారా 1,96,619 టీచర్ పోస్టులను భర్తీ చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. 'ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కావాలంటే తెలుగుదేశం ప్రభుత్వం రావాలి' అన్నది ఒక సెంటిమెంట్ అయ్యిందంటే దానికి కారణం డీఎస్సీ చరిత్రేనన్నారు. డీఎస్సీ విజేతల కళ్ళలో ఆనందమే మా కూటమి ప్రభుత్వానికి ఆశీర్వాదం అన్నారు. దర్శి ప్రాంతానికి చెందిన వారికి 60 మంది ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఈవోలు రఘురామయ్య, రమాదేవి, సాంభాశివరావు, సుబ్బారావు, ఖాలీషా, దర్శి టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# డ్రామాలు కట్టిపెట్టండి

### వైసీపీ నేతలకు టీడీపీ మైనార్టీ నేతల హెచ్చరిక



నెల్లూరు, (చైతన్యరథం): నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. టీడీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాఫర్ షరీఫ్ మాట్లాడుతూ... 13.3 ఎకరాల వక్ఫ్ స్థలం ఆక్రమణకు గురవుతున్న విషయాన్ని చైర్మన్ అబ్దుల్ అజీజ్ దృష్టికి తీసుకెళ్తే రెవిన్యూ, వక్ఫ్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ స్థలాల్లో సర్వేలు నిర్వహించి ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1120 ఎకరాల వక్ఫ్ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ముస్లిం సమాజం బాగుపడుతుంది అన్న అక్కసుతో వైసీపీమీతున్నారని అన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్ మాట్లాడుతూవక్ఫ్ ఆస్తిని కాపాడాలన్న ఉద్దేశంతో జామియా మసీదులో నిధులు లేకపోయినా వక్ఫ్ బోర్డ్ కామన్ ఫండ్ నుంచి దాని అభివృద్ధికి చర్యలు చేపట్టారని తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా ఉండే సైన్స్ పార్క్ ఆపేందుకు ఎటువంటి ప్రయత్నం చేయని దౌర్భాగ్యులు ఆయన గురించి మాట్లాడటం దౌర్భాగ్యం అని అన్నారు. టీడీపీ మైనార్టీ నేత కాలేషా మాట్లాడుతూ వైసీపీ లీడర్లమని చెప్పుకుంటూ అవినీతి కబ్జాలు కొనసాగించాలనుకుంటున్న వీరికి అడ్డుకట్ట వేయటంతో డ్రామాలు మొదలు పెట్టారని అన్నారు. సమావేశంలో నౌషాద్, ఇక్బాల్, పాషా మొహిదీన్, జాఫర్, ఉస్మాన్, మౌలానా అజీజ్, రబ్బాని, హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం అక్రమార్కులను పీడీ యాక్ట్‌తో శిక్షించాలి

### నుడా చైర్మన్ కోటంరెడ్డి డిమాండ్

నెల్లూరు, (చైతన్యరథం): పేదల బియ్యాన్ని బొక్కేస్తున్న పంది కొక్కులపై పీడీ యాక్ట్ నమోదు చెయ్యాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. వారికి సహకరిస్తున్న సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులు పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్లో కోటంరెడ్డి మీడియాతో మాట్లాడారు. పేదల బియ్యాన్ని అడ్డంగా దోచుకుంటున్న పంది కొక్కులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఇటీవల సుభాని నగర్ లో పట్టుపడ్డ లారీలలో రేషన్ బియ్యం ఉంటే.. కేవలం రెండు లారీల్లోనే రేషన్ బియ్యం ఉన్నాయంటూ మిగిలిన లారీలు వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేష్ రెడ్డి పై మాత్రమే కేసు పెట్టారని.. అతనొక దళారీ మాత్రమేనని.. సూత్రధారిపై వెంటనే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్, కోవూరు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నప్పటికీ రేషన్ మాఫియా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతోందన్నారు. సివిల్ సప్లై అధికారులు జాయింట్ కలెక్టర్‌ను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని.. ఆరోపించారు. పిడిఎస్ రైసును నెల్లూరులో రీసైక్లింగ్ చేసి చెన్నైకి తరలిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి చెడ్డ పేరు వచ్చేలా ఎవరు వ్యవహరించినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. సివిల్ సప్లై మంత్రిగా ఉన్న నాదెండ్ల మనోహర్‌తో లోతుగా దర్యాప్తు చేయించాలన్నారు. జిల్లాలోని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబులు ఇద్దరూ అవినీతిని ఒప్పుకోరని... కొందరు అధికారుల అవినీతి వల్లే పిడిఎస్ రైస్ అక్రమార్కులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని కోటంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న అధికారంలో ఉన్న తాను ఎప్పుడు ప్రజాపక్షమేనని కోటంరెడ్డి అన్నారు. నెల్లూరు ప్రకాశం చిత్తూరు జిల్లాలోని పిడిఎస్ రైసు డాన్ స్మగ్లింగ్ చేస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు.



# పేదల జీవితాల్లో వెలుగులు నిండాలి

### స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు



నెల్లూరు, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం పేద ప్రజల జీవితాల్లో పసిడి వెలుగులు నింపేలా కార్యక్రమాలను అమలు చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ద్వారా నెల్లూరుకు ముందుగానే దీపావళి వచ్చిందని.. ఈ వెలుగులు శాశ్వతం చేస్తామని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో ఆధునిక దుకాణాలను ఏర్పాటు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. నెల్లూరు మైపాడు గేట్ వద్ద 120 స్మార్ట్ దుకాణాలకు సౌర విద్యుత్, వైఫై లాంటి ఆధునిక సదుపాయాలతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబన కల్పించేలా తొలిసారి ఓ మంచి ప్రయోగం చేశామని ఇది చరిత్రలో నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. 120 మంది చిన్న పారిశ్రామిక వేత్తలుగా మొదటి అడుగు వేశారని.. వారు మరింతగా ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి అభిలషించారు. రాష్ట్రంలో డ్వాక్రా, మెప్మా సంఘాలకు చెందిన 1 లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేస్తామని అన్నారు.

#### వీధి వ్యాపారుల్లో ఆనందం

నెల్లూరు మైపాడు గేట్ లో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ లో దుకాణాలు దక్కించుకున్న మహిళలు అమితానందాన్ని వ్యక్తం చేశారు. మహిళా వ్యాపారులతో ముఖ్యమంత్రి అమరావతి నుంచి వర్చువల్‌గా మాట్లాడి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఈ స్మార్ట్ దుకాణాలు వారి జీవితాల్లో ఎలాంటి మార్పులు తెస్తాయన్న అంశాలను వారి నుంచే అడిగి తెలుసుకున్నారు. దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీధి వ్యాపారాలకు సైతం కిరాయి చెల్లించుకోలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభఉత్వం తమకు ఈ దుకాణలు ఇచ్చి ఆదుకుని తమ జీవితాల్లో వెలుగులు నింపిందని లబ్దిదారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పేదలు, మధ్యతరగతి వారి జీవన ప్రమాణాలు పెంచేందుకే ప్రభుత్వం కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ లో దుకాణాలు దక్కించుకున్న మహిళా వ్యాపారులు వాటి ధృవీకరణ పత్రాలను చేతుల్లో పట్టుకుని ముఖ్యమంత్రికి చూపించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ద్వారా నిత్యావసరాలతో పాటు వివిధ వస్తువుల ధరలు తగ్గాయని రెండు శ్లాబ్ లతో ప్రజలపై భారం తగ్గిందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ నెల 16 తేదీన ప్రధాని మోదీ కూడా కర్నూలుకు వచ్చి ఈ అంశాలను ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, మెప్మా ఎండీ తేజ్ భరత్ ,కమీషనర్ నందన్, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ,నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి ,రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధా, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి , రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, నగర అధ్యక్షులు మామిడాల మధు, టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనేతలు, అధికారులు పాల్గొన్నారు.



కొమరోలు మండలం రాజుపాలెం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమం స్థానిక టీడీపీ ఇంచార్జి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి చేతులమీదుగా పంపిణి జరిగింది.

# సాగుకు నీళ్లిస్తే రైతులు బంగారం పండిస్తారు

## పీఎం ధన, ధాన్య కృషి యోజన కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత , పాల్గొన్న మాజీమంత్రి పల్లె, కలెక్టర్



పుట్టపర్తి, (చైతన్యరథం): నీరు ఇస్తే తమ ప్రాంత రైతులు బంగారు పంటలు పండిస్తారు అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ప్రధానమంత్రి ధన, ధాన్య కృషి యోజన పథకం ప్రారంభం పుట్టపర్తిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే పరిటాల సునీత, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. పథకం ప్రారంభం సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఈ పథకం కింద శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలను ఎంపిక చేసినందుకు ప్రధానమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ధన, ధాన్య కృషి యోజనకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో పథకం కింద ఆరేళ్లలో రెండు జిల్లాల్లో రూ.240 కోట్ల చొప్పున అందజేస్తారన్నారు. మేలైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం, సమతుల ఎరువుల వాడకం, యాంత్రీకరణ, దిగుబడి అనంతర నష్టాలను తగ్గించడం ద్వారా ఉత్పాదకత పెంచడం వంటివి ఉంటాయన్నారు ఈ పథకం ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో రైతులకు అందేలా చూడాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఎమ్మెల్యే సునీత కోరారు. తనకు వ్యవసాయం అంటే చాలా ఇష్టమని ఎప్పుడు సమయం దొరికిన తన వ్యవసాయ క్షేత్రంలో గడుపుతుంటామన్నారు. తన భర్త పరిటాల రవీంద్రకు కూడా వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించినందుకు అవార్డులు వచ్చాయన్నారు. మా ప్రాంత రైతులకు నీరు లేక సరిగా పంటలు పండించలేకపోతున్నారన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ వలన హంద్రీనీవా నీరు రావడంతో రైతులకు చాలా మేలు జరిగిందన్నారు. అన్ని ప్రాంతాలకు నీరు అందించగలిగితే జిల్లాలో వ్యవసాయం వేరే విధంగా ఉంటుందన్నారు. చాలామంది సాంప్రదాయ పంటలు సాగు చేసే నష్టపోతున్నారని వాటి స్థానంలో చిరుధాన్యాల సాగు చేపడితే లాభాలు తీసుకోవచ్చన్నారు. ఆ దిశగా రైతులకు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సునీత అన్నారు.



## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

### ఆదుకున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

కోవూరు, (చైతన్యరథం): కొడవలూరు మండలం రాజుపాలెం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో 4 ఇళ్ళు కాలి బుగ్గయి పోయాయి. విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అధికారులను సహాయక చర్యలకు ఆదేశించారు. దగ్ధమైన ఒక్కో ఇంటికి 25వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం తరుపున ఇల్లు మంజూరు చేయిస్తామమని బాధితులకు హామీ ఇచ్చారు.

## వైకల్యం శాపం కారాదు : ఎమ్మెల్యే సునీత

రాప్తాడు, (చైతన్యరథం): వికలత్వాన్ని ఎవరు శాపంగా భావించవద్దని, వారిని చూసి అవమానించవద్దని, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల ఎంపిక శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 168 మంది, ఇతర పాఠశాలల్లో 312మందిని మొత్తం 480 మందిని గుర్తించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ వికలాంగుల కష్టాలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 3వేలు రూపాయలు ఉన్న పింఛన్ 6వేలు చేశారని అన్నారు. త్వరలోనే ఆర్డీటీ సంస్థకు సంబంధించి కేంద్రప్రభుత్వం నుండి శుభవార్త వస్తుందన్నారు.





# ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

## సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ హాజరవుతారని మంత్రుల వెల్లడి

కర్నూలు, (చైతన్యరథం): 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్' సభ ఏర్పాట్లపై కర్నూలులో శనివారం విస్తృత స్థాయి సమీక్ష జరిగింది. కర్నూలు రంగమయూరి గ్రీన్ హిల్స్ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మాజీ మంత్రి, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే సుచరిత, నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తిక్కారెడ్డి పాల్గొన్నారు. సభ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, రవాణా, భద్రత, వేదిక నిర్మాణం, ప్రజా సౌకర్యాలపై చర్చించారు. ఈనెల 16వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలులో జరిగే సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ సభలో పాల్గొననున్నారు. ఉదయం సున్నిపెంట వద్ద హెలీప్యాడ్‌కి చేరుకున్న అనంతరం రోడ్డు మార్గం ద్వారా శ్రీశైలం వెళ్లి భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివారిని దర్శించుకోనున్నారు. ఆ తర్వాత కర్నూలు సమీపంలోని సభా ప్రాంగణానికి చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

### సీఎం చంద్రబాబు, పవన్, లోకేష్ హాజరు

ఈ సభలో ప్రధాని మోడీతోపాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. సభలో జీఎస్టీ సంస్కరణలు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై వాటి ప్రభావం, ప్రజలకు కలిగిన లాభాలపై నేతలు వివరించనున్నారు. సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ, జీఎస్టీ అమలుతో నిత్యావసర వస్తువులు సహా అనేక ఉత్పత్తుల ధరలు తగ్గడంతో ప్రతి కుటుంబానికి వేల రూపాయల ఆదా జరుగుతోందని,కొత్త జీఎస్టీ విధానం అమలులోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఆటోమొబైల్ సేల్స్ గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రాండ్ జీఎస్టీ షాపింగ్ ఫెస్టివల్స్ జీఎస్టీపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అక్టోబర్ 16 నుండి 19 వరకు జిల్లా కేంద్రాల్లో "గ్రాండ్ జీఎస్టీ షాపింగ్ ఫెస్టివల్స్" నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రయోజనాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# మెగా డీఎస్సీలో 70 మంది విజేతలు

## సన్మానించిన పొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి




ప్రొద్దుటూరు, (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మెగా డీఎస్సీలో ఉత్తీర్ణులైన 70 మంది అభ్యర్థులందరికీ అభినందన సభ ఏర్పాటు చేశారు. విజేతలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్లు ముక్తియార్, ఆసం రఘురామి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌భర్త మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ డైరెక్టర్ శ్రీనివాసాచారి, చల్లా రాజగోపాల్ యాదవ్, సీతంపల్లె చంద్రా, బీజేపీ నాయకులు కోనేటి ప్రదీప్ రెడ్డి, జనసేన నాయకులు జిలాన్ బాషా, లింగాపురం ఏజీఆర్ బ్యాంకు చైర్మన్ సిద్దారెడ్డి నాగముని రెడ్డి, విద్యాశాఖ అధికారులు సావిత్రమ్మ, శోభారాణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# దళిత ద్రోహి జగన్‌రెడ్డి

## అంబేద్కర్‌ను అవమానిస్తే తగిన శాస్తి చేస్తామని టీడీపీ ప్రజాప్రతినిధుల హెచ్చరిక



దేవళంపేట, (చైతన్యరథం): గంగాధరనెల్లూరు నియోజకవర్గం, వెదురుకుప్పం మండలం, దేవళంపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ రాజు, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవాయి విజయశ్రీ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ ఘన నివాళులు అర్పించారు. దేవళంపేటలో ఇటీవల అంబేద్కర్ విగ్రహానికి నిప్పు అంటుకున్న ప్రాంతాన్ని హోంమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు పరిశీలించారు. పాత విగ్రహం స్థానంలో ఏర్పాటు చేసిన నూతన విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి హోంమంత్రి అనిత, ఎంపీ ప్రసాదరావు మాట్లాడుతూ...జగన్మోహన్ రెడ్డి దళితులను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తున్నాడన్నారు. తన స్వార్థ రాజకీయాల కోసం అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టి, దీనిని రాష్ట్రస్థాయి ఆందోళనగా మార్చాలని తాడేపల్లి డైరెక్షన్‌లో నాటకాన్ని వైసీపీ నేతలు రక్తికట్టించాలని ప్రయత్నించాడన్నారు. ముందస్తు ప్లానులో భాగంగానే దేవళంపేటలో వైసీపీ నేతల కుట్రపూరిత ధర్నాలు, నిరసనలు చేసి పోలీసులను, రాష్ట్ర ప్రజలను పక్కదారి పట్టించాలని ప్రయత్నం చేశారు. అంబేద్కర్ విగ్రహం కాలిపోవడానికి కారణమైన పాకను ఎవరు దగ్ధం చేశారో కూడా త్వరలోనే పోలీసులు నిగ్గు తేలుస్తారు. అంబేద్కర్ విగ్రహం కాలిపోయిందనే వార్త తెలిసిన వెంటనే దీనికి కారణమైనవారు ఎవరినీ వదిలిపెట్టవద్దని పోలీసులకు నిష్పక్షపాతంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఏపార్టీకి చెందిన వ్యక్తులైనా, ఏ కులానికి చెందినవారైనా తక్షణమే కస్టడీలోకి తీసుకుని విచారించాలని సూచించామని అన్నారు.



## నా తలరాత నాకు తెలుసు

### సీఎం మార్పుపై కర్ణాటక డీసీఎం డీకే శివకుమార్

కర్ణాటకలో కొంతకాలంగా సీఎం మార్పుపై మళ్లీ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో ముఖ్యమంత్రి మార్పు ఉండొచ్చన్న కథనాలపై శని వారం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. తనకేం తొందరలేదని, తన తలరాత ఏంటో తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండున్నరేళ్ల అనంతరం ముఖ్యమంత్రి పీఠం మార్పు ఉంటుందని కాంగ్రెస్ అధికారంలో వచ్చిన ప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. దీనిపై డీకే గతంలోనూ స్పందిస్తూ.. అన్నింటికి కాలమే సమాధా నం చెప్తుందని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి పదవిని చేపట్టాలనే ఆశ తనకు ఉందనేలా పరోక్షంగా బదు లిచ్చారు. కర్ణాటక ప్రభుత్వంలో ప్రస్తుతం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న 50 శాతం మంది మంత్రులను తొలగించి, కొత్తవారికి అవకాశం ఇస్తారన్న కథనాలు వినిపిస్తున్నాయి. నవంబర్లో ఈ మంత్రివర్గ పునర్వ్య వస్థీకరణ చేపట్టాలని సీఎం సిద్ధరామయ్య యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం చేంజ్ గురించి మరోసారి వార్తలు వచ్చాయి.

## అడవి పందులను చంపుకు తినేయండి

### కేరళ మంత్రి సమాధానానికి కంగుతిన్న బాధితులు



తమ సమస్యను పరిష్కారించాలని కోరుతూ వచ్చిన ప్రజలకు కేరళ (Kenila) మంత్రి ఇచ్చిన సూచనతో వారు కంగుతిన్నారు. శనివారం పొలమేల్ గ్రామ పంచాయతీ నిర్వహించిన ఓ కార్యక్రమానికి కేరళ వ్యవసాయ మంత్రి పి.ప్రసాద్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పంట పొలాలలో అడవి పందుల సమస్తును నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు ఆయనను కోరారు. ఈ సమస్యకు అడవి పందులను చంపి తినడమే పరిష్కారమని.. మరేమార్గం లేదని ఆయన వారికి సూచించారు. అయితే కేంద్ర ప్రభుత్వం వాటిని చంపడానికి అనుమతివ్వదన్నారు. పంట నష్టాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే అడవి పందులను చంపి వాటిని తినేందుకు కేంద్రం ప్రజలకు అనుమతులివ్వాలని అన్నారు. ఈ విధంగా చేస్తేనే అడవి పందుల సమస్యను వేగంగా పరిష్కరించి, పంటలను కాపాడుకోగలమని కేరళ వ్యవసాయ మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. వాటిని చంపకుండా ఉండాలని చెప్పేందుకు ఆడవి పందులేమీ అంతరించిపోతున్న జాతి కూడా కాదని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్గా మారడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# తమిళనాడు నిర్లక్ష్యం వల్లే దగ్గుమందు మరణాలు

## కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ దర్యాప్తు



దగ్గుమందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ కంపెనీని ఇప్పటివరకు వారు ఒక్కసారి కూడా తనిఖీ చేయలేదన్నాయి. దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ పలు వైఫల్యాలను గుర్తించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'కోల్డ్రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్ లో 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీ పురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్లో 48.6 శాతం డైఇథైలీన్ గ్లైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్న సంగతి తెలిసిందే.ఈనేపథ్యంలోనే కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ తన దర్యాప్తులో పలు లోపాలను గుర్తించి నట్లు సమాచారం.రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని గుర్తించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్లోకి ప్రవేశించిందని పేర్కొన్నాయి. ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి. ఆ ఫార్మా సంస్థలో ఏ ప్రభుత్వ ఏజెన్సీ ఆడిట్ నిర్వహించలేదని తెలుస్తోంది. అలాగే ఔషధ తయారీ సంస్థగా ఈ కంపెనీ కేంద్ర పోర్టల్లో రిజిస్టర్ కాలేదని గుర్తించా రు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చే గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ సర్టిఫికేట్ లేకుం డానే దశాబ్దాల పాటు ఫార్మా సంస్థ నడిచేందుకు తమిళనాడు ప్రభుత్వం అను మతివ్వడాన్ని దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది. విచారణలో భాగంగా కేంద్ర బృందానికి రాష్ట్ర అధికారులు సహకరిం చడం లేదని, ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదని ఆరో పించింది. కాగా, డ్రగ్స్ తయారీ యూనిట్లను తనిఖీ చేయడంలో కేంద్రం విఫలమైందని ఇప్పటికే తమిళనాడు విమర్శించింది. ఈ అంశంపై తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ మాట్లాడుతూ, మరింత హాని జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుందని చెప్పారు. ఇక, కంపెనీ యజమానిని రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

# తొక్కిసలాట బాధితులను కలవనున్న నటుడు విజయ్

## కరూర్లో భారీగా భద్రతా ఏర్పాట్లు



టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో విజయ్ భారీ భద్రత నడుమ బాధిత కుటుంబాలను కలవనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. బాధిత కుటుంబాలను వారి ఇళ్ల వద్ద కాకుండా.. ఓ ప్రత్యేక వేదికలో ఈ నెల 17న పరామర్శించనున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే వేదికకు సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడించలేదు. విజయ్ బాధితులను కలిసే సమయంలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతను ఏర్పాటు చేయాలని టీవీకే పార్టీ విజ్ఞప్తి చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ధ్రువీకరించారు. ఈ కార్యక్రమానికి పరిమిత సంఖ్యలో మాత్రమే మీడియాను అనుమతిస్తామని తెలిపారు. తిరుచ్చి విమానాశ్రయం నుంచి కరూర్లోని సమావేశ వేదిక వద్దకు విజయ్ చేరుకునే వరకు దారిలో ఎక్కడా జనం గుమిగూడకుండా, విమానాశ్రయ, ట్రాఫిక్ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. కరూర్లోని వేదిక నుంచి ఒక కిలోమీటరు మేర ప్రజలెవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ వర్గాలు కోరినట్లు తెలిపారు. కేవలం బాధిత కుటుంబసభ్యులకు మాత్రమే వేదిక వద్దకు ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. కరూర్లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం, ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు.. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించేవరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది.

# బెంగాల్ ఎన్నికల అధికారికి సీఎం దీదీ బెదిరింపులు

## కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్

అవినీతి ఆరోపణల పేరుతో పశ్చిమ బెంగాల్ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ మనోజ్ అగర్వాల్ను ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బెదిరించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో కావాలని 'ఈసీ అడిగినట్లు జాతీయ మీడియాలో కథనం వచ్చింది. బెంగాల్ సీఈవో మనోజ్ అగర్వాల్ తన హద్దులను దాటితే ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలను బయట పెడతానని మమతా బెనర్జీ ఇటీవల ఓ సమావేశంలో వ్యాఖ్యానించినట్లు సమాచారం. అదేవిధంగా రాష్ట్ర అధికారులను కూడా ఆయన బెదిరిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఆరోపించారు.




2011లో సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి.. ఓ సీఈవోపై దీదీ ఈ స్థాయిలో ఆరోపణలు చేయడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యల క్లిప్పింగ్, దాని అనువాద ప్రతిని అందజేయాలని సీఈవో కార్యాలయానికి ఈసీ సూచనలు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం వచ్చింది. మమతా వ్యాఖ్యలను ఖండిస్తూ అంతకుముందు ప్రతిపక్ష నేత సువేందు అధికారి నేతృత్వంలో భాజపా ఎమ్మెల్యేలు ఎన్నికల సంఘానికి ఓ లేఖ సమర్పించారు. సీఈవోను బెదిరించినందుకు సీఎంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు.

# డ్రాగన్‌పై ట్రంప్ బాంబ్

- 1నుంచి అదనంగా నూరుశాతం సుంకాలు
- ఖనిజాల ఎగుమతిపై చైనా ఆంక్షలకు కౌంటర్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల బాంబు పేల్చారు. చైనా దిగుమతులపై అదనంగా 100 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ టారిఫ్‌లు నవంబరు 1నుంచి అమల్లోకి రానున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే చైనాపై 30శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. వాణిజ్యంపై చైనా అసాధారణంగా దూకుడుగా వ్యవహరిస్తోందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. “చైనా తయారీ వస్తువులు ఏ దేశంనుంచి దిగుమతి అయినా.. చైనా ఏ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేసినా వాటికి ఈ సుంకాలు వర్తిస్తాయి” అని అమెరికా అధ్యక్షుడు తన పోస్టులో వెల్లడించారు. ఇది అన్ని దేశాలను ప్రభావితం చేస్తుందని, ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండబోదని తెలిపారు. నవంబరు 1నుంచి లేదా ముందుగానే ఈ టారిఫ్‌లు అమల్లోకి రావచ్చన్నారు. చైనా తీసుకునే తదుపరి చర్యలను బట్టి దీనిపై యూఎస్ నిర్ణయం ఉంటుందన్నారు. అలాగే, క్రిటికల్ సాఫ్ట్‌వేర్‌ను ఇతర దేశాలతో పంచుకోవడంపై నియంత్రణ విధిస్తున్నట్టు వివరించారు. అమెరికా తయారుచేసే దాదాపు ప్రతి ఉత్పత్తిపైనా భారీగా ఎగుమతి ఆంక్షలు విధించాలని చైనా యోచిస్తోందనే నివేదికల ఆధారంగా తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమెరికాకు అరుదైన ఖనిజాలు ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తంచేసిన ట్రంప్.. భారీ సుంకాలు విధిస్తానంటూ హెచ్చరికలు చేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకుంటా నంటూ బెదిరింపులకు దిగారు. ఇది జరిగిన కొన్ని గంటలకే ట్రంప్ సుంకాల ప్రకటన చేయడం గమనార్హం. ఇక, గతంలోనూ అమెరికా– చైనాల మధ్య వాణిజ్యయుద్ధం నడిచిన సంగతి తెలిసిందే. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరిగిన వాణిజ్య వివాదం తగ్గించే లక్ష్యంగా ఇరుదేశాల మధ్య చర్చ లు జరిగాయి. ఈ క్రమంలో ట్రేడ్ డీల్‌కు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ.. అది ఓ కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి.

# లాహోర్‌లో అల్లర్లు

## పోలీస్ కాల్పుల్లో 11మంది దుర్మరణం



గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ తెహ్రీక్–ఇ–లబైక్ పాకిస్థాన్ కార్యకర్తలు గురువారంనుంచి పాక్‌లోని పలు ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అల్లర్లలో పంజాబ్ పోలీసులు తమ 11మంది కార్యకర్తలను హత్య చేసినట్టు ఆ పార్టీ చీఫ్ సాద్ రిజ్వి ఆరోపించారు. ఘర్షణల సమయంలో 24మందికి పైగా కార్యకర్తలు గాయపడినట్టు పేర్కొన్నారు. వారిని ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యం చేయడానికి కూడా అక్కడి వైద్యులు నిరాకరించారన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై పోలీసులు ఉద్దేశపూర్వకంగానే దాడులు చేస్తున్నారని సాద్ రిజ్వి ఆరోపించారు. శాంతియుతంగా చేపట్టిన నిరసనలను హింసాత్మకంగా అణచివేయాలని చూస్తున్నారన్నారు. ఎవరి ఆదేశాలతో తమపై కాల్పులు జరుపుతున్నారని పోలీసులను ప్రశ్నించారు. తన నివాసంపై దాడిచేసి తన తల్లిని, భార్యాపిల్లలను అదుపులోకి తీసుకున్నారని మండిపడ్డారు. గాజాలో మరణాలు, ట్రంప్ శాంతి ప్రణాళికను నిరసిస్తూ తెహ్రీక్–ఇ–లబైక్ పాకిస్థాన్ కార్యకర్తలు గురువారం పాక్‌లోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. శుక్రవారం నిరసనకారులు ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీ ముట్టడికి యత్నించడంతో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులను కట్టడి చేసేందుకు భద్రతా దళాలు ప్రయత్నిస్తున్న క్రమంలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ నిరసనల్లో పలువురు టీఎల్పీ కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారు. ఇస్లామాబాద్, లాహోర్, రావల్పిండిలో నిరసనల కారణంగా పాకిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో ప్రధాన రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ప్రధాన నగరాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ఇస్లామాబాద్, రావల్పిండిలో లాక్‌డౌన్ విధించినట్టు అధికారులు పేర్కొన్నారు.

# ఆయుధసంపత్తి ఫ్యాక్టరీలో పేలుడు

## భారీగా మరణాలు.. 19మంది గల్లంతు

అమెరికా టెన్నిస్సీలోని ఆయుధ తయారీ కర్మాగారంలో భారీపేలుడు సంభవించి 19మంది గల్లంతైనట్టు అధికారులు వెల్లడించారు. అక్యురేట్ ఎనర్జిటిక్ సిస్టమ్స్ ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడు ధాటికి భవనం పూర్తిగా నేలమట్టమైంది. శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీలోని పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. మంటలు చెలరేగడంతోపాటు పెద్ద ఎత్తున పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు 17 కిలోమీటర్ల వరకు వినిపించాయని స్థానికులు తెలిపారు.



# ఏ టూ జెడ్ 2000!

## గిన్నెస్ రికార్డులకెక్కిన పేరుకి ఇది షార్ట్‌కట్



ఆరడుగులు కూడా లేని మనిషికి.. పేరు మాత్రం కిలోమీటరంత పొడవుంది..! సాధారణంగా ఎవరైనా తమ పేరు గిన్నిస్ రికార్డుల్లో ఉండాలని అనుకుంటారు. కానీ, ఈయన తన పేరుతోనే గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాడు. మరి సాదాసీదా పేరా ఆయనది.. ఏకంగా 2000కు పైగా పదాలున్న పెద్ద పేరది..! ఆయనే న్యూజిలాండ్‌కు చెందిన లారెన్స్ వాట్కిన్స్. లారెన్స్ వాట్కిన్స్ తన పేరుతో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 1965లో జన్మించిన ఆయన.. తన పేరును 2వేలకంటే ఎక్కువ పదాలకు పెంచుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో 1990లో న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. జిల్లాకోర్టు దానికి అనుమతించింది. అయితే, విచారణ సమయంలో రిజిస్ట్రార్ జనరల్ దాన్ని తిరస్కరించారు. తర్వాత లారెన్స్ హైకోర్టులో అప్పీల్ చేయగా.. విచారణ అనంతరం ఆయనకు మద్దతుగా తీర్పు వెలువడింది. అనంతరం తన పేరును 2,253 పదాలతో పెట్టుకున్నారు. దీంతో ప్రపంచంలోనే అత్యంత పెద్ద పేరు కలిగిన వ్యక్తిగా తాజాగా ఆయన రికార్డు సాధించారు. గిన్నిస్ రికార్డ్ కోసం కొంతమంది చేసే విచిత్రమైన, అసాధారణమైన విషయాలకు తాను ఆకర్షితుడినయ్యానని లారెన్స్ తెలిపారు. ఈ క్రమంలోనే తాను రికార్డ్ నెలకొల్పాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. గిన్నీస్ రికార్డ్స్ గురించి విచారిస్తుండగా.. తన పేరుతోనే దీన్ని సాధించొచ్చని తెలుసుకున్నానన్నారు. దీంతో వెంటనే అందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు వెల్లడించారు. లారెన్స్ స్థానిక లైబ్రరీలో పనిచేస్తుంటారు. పేరును పొడిగించుకునేందుకు తన స్నేహితులు, సహోద్యోగులు సాయం చేశారని వివరించారు. ఈ సందర్భంగా తనను చాలామంది ఏ టూ జెడ్ 2000 అని పిలుస్తుంటారని, అలా పిలవడం తనకెంతో నచ్చుతుందని లారెన్స్ పేర్కొన్నారు.



# దక్కని ‘శాంతి’.. స్పందించిన ట్రంప్

నోబెల్ శాంతి బహుమతిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నో ఆశలు పెట్టుకొన్న సంగతి తెలిసిందే. అయితే, ప్రతిష్టాత్మకమైన అవార్డు ఆయనకు దక్కలేదు.దీనిపై తాజాగా ఆయన స్పందించారు. నోబెల్ శాంతి బహుమతి లభించిన వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కోరినా మచాదోతో మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు. ఈసందర్భంగా ఆమె తన గౌరవార్థం బహుమతిని స్వీకరిస్తున్నట్టు చెప్పారని అధ్యక్షుడు వివరించారు. శుక్రవారం (అమెరికా కాలమానం ప్రకారం) వైట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈవ్యాఖ్యలు చేశారు. “నోబెల్ బహుమతి పొందిన మరియాతో నేను ఫోన్లో మాట్లాడాను. ‘మీ గౌరవార్థం నేను దీన్ని అంగీకరిస్తున్నాను. ఎందుకంటే దీనికి మీరు కూడా నిజంగా అర్హులు’ అని ఆమె అన్నారు. అలాగని ఆ బహుమతి నాకు ఇచ్చేయమని నేను ఆమెతో అనలేదు. విపత్తు సమయంలో వెనెజువెలాలోని ప్రజలకు ఆమె చాలా సాయం చేశారు. నేను ఆమెకు తోడున్నా. ఇకముందు కూడా ఉంటా” అని ట్రంప్ పేర్కొన్నారు. ఇక, ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాదోను వరించిన సంగతి తెలిసిందే. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకుగాను మరియా కొరీనాకు ఈపురస్కారం ఇస్తున్నట్టు నార్వే నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతిమార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. ఏడాదిగా అజ్ఞాతంలో ఉండాల్సి వచ్చిందని పేర్కొంది. తనకు దక్కిన ఈఅవార్డును ట్రంప్‌నకు అంకితమిస్తున్నట్లు మచాదో పేర్కొన్నారు. ఎన్నో కష్టాలు పడుతున్న వెనెజువెలా ప్రజలకు, తమ పోరాటానికి ఆయన మద్దతిస్తున్నారని వెల్లడించారు. అమెరికా, లాటిన్ అమెరికా ప్రజలు మునుపెన్నడూ లేనంతగా ప్రస్తుతం ట్రంప్‌పై ఆధారపడి ఉన్నారన్నారు. మరోవైపు ట్రంప్‌నకు నోబెల్ రాకపోవడంపై వైట్‌హౌస్ ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. గాజా కాల్పుల విరమణ తర్వాత కూడా ట్రంప్ సేవలకు తగినంత గౌరవం దక్కలేదని పేర్కొంది. ఈ క్రమంలో నోబెల్ కమిటీ శాంతికంటే రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చిందని ఆరోపించింది.

## గాజాలో అమల్లోకి కాల్పుల విరమణ

యుద్ధరంగమైన గాజాలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం, హమాస్ తిరుగుబాటుదార్లు కాల్పులను విరమించారు. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని ఇజ్రాయెల్ మిలటరీ మధ్యాహ్నం ప్రకటించింది. అంతకుముందు ఇజ్రాయెల్ మంత్రివర్గం సమావేశమై యుద్ధంలో విరామం పాటించాలని నిర్ణయించింది. హమాస్ విడుదల చేయనున్న బందీలకు బదులుగా పాలస్తీనా ఖైదీలను అప్పగించాలని కూడా తీర్మానించింది. కాల్పులను విరమించడంతో సెంట్రల్ గాజాలోని వాడీ గాజాలో వేలాదిమంది చేరారు. అక్కడి నుంచి గాజాలోని ఉత్తర ప్రాంతానికి నడక ప్రారంభించారు. కాగా, గాజాలోని అన్నార్థులకు ఆదివారం నుంచి ఆహారం అందించనున్నట్టు ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.



# ‘ఆ హీరో 8గంటలే పనిచేస్తాడు’

ఎన్నో రంగాల్లో చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశం ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో కూడా హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అగ్ర కథానాయిక దీపిక పదుకొనె వర్కింగ్ అవర్స్ కారణంగానే పెద్ద ప్రాజెక్టులు వదులుకుందన్న వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. తాజాగా ఆమె ఈ అంశంపై స్పందిస్తూ.. ఇండస్ట్రీలో కొందరు స్టార్ హీరోలు రోజులో 8 గంటలు మాత్రమే పని చేస్తారని చెప్పడంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో గతంలో అభిషేక్ బచ్చన్ ఓ హీరోను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలు షేర్ అవుతున్నాయి. బాలీవుడ్‌లో ఎంతో ప్రాముఖ్యం సొంతం చేసుకున్న కార్యక్రమం ‘ది కపిల్ శర్మ షో’. గతంలో ఈ కార్యక్రమంలో అభిషేక్ బచ్చన్, అక్షయ్ కుమార్ పాల్గొని సందడి చేశారు. అందులో అక్షయ్ గురించి అభిషేక్ మాట్లాడుతూ.. “అక్షయ్‌కి ఉత్సాహమెక్కువ. అందుకే 8 గంటలు



దాటితే ఒక్క నిమిషం కూడా సెట్లో ఉండడు. సెట్‌నుంచి బయటకు రాగానే మేకప్, కాస్ట్యూమ్స్ అన్నీ తీసేస్తాడు. ఒకవేళ షెడ్యూల్ ఉదయం ఏడు గంటలకు ప్రారంభమవుతుందంటే.. కచ్చితంగా ఆ సమయానికి సెట్లో ఉంటాడు” అని చెప్పారు. దీంతో దీపిక చెప్పిన స్టార్ హీరో.. ఆయనేనా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తనపై వస్తోన్న వార్తలపై తాజాగా దీపిక స్పందించిన విషయం తెలిసిందే. భారతీయ చిత్ర పరిశ్రమలో చాలామంది అగ్రహీరోలు ఎన్నో ఏళ్లుగా 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. ఇదేం రహస్యం కాదన్నారు. కానీ, ఇన్నేళ్లలో ఈ విషయం ఎప్పుడూ వార్తల్లో నిలవలేదని ఇప్పుడు తాను అడిగినప్పుడు మాత్రమే ఇలా హైలైట్ చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు.

# కలిసి పనిచేయడం నా అదృష్టం



బాలీవుడ్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ నేడు 83వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా ఆయనకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఇన్‌స్టా వేదికగా బిగ్ బీకి విషెస్ తెలిపారు. “మీ వర్క్ దగ్గరనుంచి చూడడం, మీతో కలిసి స్క్రీన్ పంచుకోవడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. మీరు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో సెలబ్రేట్ చేసుకోవాలి” అంటూ విషెస్ చెప్పారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతేడాది విడుదలైన ‘కల్కి 2898 ఏడీ’ బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ మూవీలో అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, ప్రభాస్ భైరవగా ఆకట్టుకున్నారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.

**‘కల్కి-2’లో అలియా భట్..**

ప్రస్తుతం ‘కల్కి-2’కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి దీపిక పదుకొణెను తొలగించిన విషయం తెలిసిందే. దీంతో సీక్వెల్లో ఆమె పాత్రను ఎవరు పోషిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ఆ పాత్రలో అలియా భట్ నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# ఆడియన్స్ షాకవుతారు..!

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేక్షకులు ఆశ్చర్యపోయే ప్రపంచాన్ని సృష్టించనున్నట్టు తెలిపారు. తాజాగా బెంగళూర్‌లో జరిగిన పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు అట్లీ అతిథిగా హాజర య్యారు. ఇందులో ‘ఎఎ 22’ గురించి మాట్లాడారు. “ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. దేవుడు మా



ప్రయాణంలో ప్రతి అడుగులోనూ తోడున్నాడు. ఆయన దయ వల్ల అంతా మేం అనుకున్నట్టే జరుగుతుందని ఆశిస్తున్నా. ఇంత భారీ ప్రాజెక్టును రూపొందించడం రిస్క్ అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా. మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారు” అని అట్లీ తెలిపారు. ఇక తాజాగా వచ్చిన ‘కాంతార చాప్టర్ 1’పై అట్లీ ప్రశంసలు కురిపించారు. అదో అద్భుతమన్నారు. “కాంతార 1’ను నేను మొదటి రోజు చూశాను. విదేశాల్లో ఉండడంతో థియేటర్‌కు వెళ్లడం కోసం దాదాపు రెండున్నర గంటలు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. సినిమా చూడగానే రిషబ్‌కు ఫోన్ చేసి అభినందించా. నేను చాలా గౌరవించే వ్యక్తుల్లో రిషబ్ ఒకరు. నాకు మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమాను రూపొందించడం ఎంత కష్టమో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. రిషబ్ ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఈ సినిమాతో మరో జాతీయ అవార్డు గెలుచుకోవాలని ఆశిస్తున్నా” అని అట్లీ తెలిపారు.

# అది నేను కాదు, ఏఐ



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తాలూకా ప్రవాహం ఏస్థాయిలో విస్తరిస్తోందనేది అందరికీ తెలిసిందే. దీనివల్ల ఎంత మంచి జరుగుతుందో అంతే చెడూ కనిపిస్తోంది. ఇది పబ్లిక్ ఫిగర్స్ విషయంలో అయితే మరింత దారుణంగా వినియోగించబడుతుందని చెప్పాలి. లేటెస్ట్‌గా ఓజి సినిమా హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్ ఇందుకు ఎఫెక్ట్ కావాల్సి వచ్చింది. ఆమెపై కొన్ని షాకింగ్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం మొదలయ్యా యి. దీనితో అవి నిజమేనని చాలామంది అనుకోగా.. వీటిపై ఓజి బ్యూటీ ఫైనల్‌గా వివరణ ఇచ్చింది. తనపై ఏఐతో సృష్టించబడ్డ కొన్ని తప్పుడు ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి అని దయచేసి వాటిని ఎవరూ నమ్మొద్దు, ఎంకరేజ్ చేయొద్దని విన్నవించుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని కేవలం న్యాయబద్ధమైన సృజనాత్మక కోసం వాడాలి తప్పితే ఇలాంటి వాటికోసం కాదని తెలిపింది. దీనితో ప్రియాంక మోహన్ పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది.

# నేడు ‘ఆంధ్ర కింగ్ తాలూకా’ టీజర్..!

రామ్ పోతినేని హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా దర్శకుడు పి మహేష్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రమే “ఆంధ్ర కింగ్ తాలూకా”. ప్రతీ ఫ్యాన్ బయోపిక్ అంటూ ప్రమోట్ చేస్తున్న సినిమా నుంచి ఇదివరకు వచ్చిన గ్లింప్స్, పాటలు ఆడియెన్స్‌ని ఆకట్టుకున్నాయి. ఇక ఫైనల్‌గా చిత్ర యూనిట్ సినిమా టీజర్ రిలీజ్‌కి రంగం సిద్ధం చేశారు. ఇలా నిన్న దాని తాలూకా డేట్ ఇస్తే ఇప్పుడు మేకర్స్ టైంని లాక్ చేసేసారు. దీంతో ఈ టీజర్ నేటి ఉదయం 11 గంటల 7 నిమిషాలకి వదులుతున్నట్టుగా ఖరారు చేశారు. ఈ చిత్రానికి వివేక్ మెర్విన్‌లు సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే ఈ నవంబర్ 28న సినిమా గ్రాండ్‌గా రిలీజ్‌కి రాబోతుంది.



# ‘రౌడీ జనార్థన్’గా విజయ్

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ రానుంది. నేడు ఈ హీరో మరో చిత్రం ప్రారంభమైంది. ‘రౌడీ జనార్థన్’ పేరుతో ఇది రానుంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. నేడు పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. ‘రాజావారు రాణిగారు’ సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్ యాక్షన్‌కు ప్రాధాన్య మున్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16నుంచి ముంబయిలో మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడింది. ఇదిలావుంటే -ఆన్‌లైన్ ఫేవరెట్ జంట విజయ్ దేవరకొండ- రష్మిక.. త్వరలోనే నిజజీవితంలో కపుల్స్ కానున్నట్టు వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. అక్టోబర్ 3న నిశ్చితార్థం జరిగిందని సన్నిహితులు వెల్లడించినట్టు వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా వీరిద్దరూ ఉంగరాలు పెట్టుకొని కనిపించడంతో ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి.

తాజాగా విజయ్ దేవరకొండ పుట్టపర్తి వెళ్లారు. అక్కడ ఆయన చేతికి బంగారపు ఉంగరం కనిపించడంతో అందరూ అది ఎంగేజ్మెంట్ రింగ్ అంటూ ఫొటోలు షేర్ చేశారు. తాజాగా నేషనల్ క్రష్ రష్మిక తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. తన అప్‌కమింగ్ సినిమా ‘థామా’లోని ‘నువ్వు నా సొంతమా’ పాట గురించి అందులో రాసుకొచ్చారు. అందులో రష్మిక చేతికి వజ్రపు ఉంగరం కనిపించడంతో మరోసారి వీరి ఎంగేజ్మెంట్ వార్త వైరల్ అవుతోంది. వీరిద్దరూ కలిసి ‘గీత గోవిందం’లో నటించి మంచి ఆన్‌లైన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. తర్వాత ‘డియర్ కామ్రేడ్’తో అలరించారు.



ప్రస్తుతం రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. ఇందులోనూ రష్మికనే కథానాయికగా కనిపించనున్నట్టు సమాచారం.